నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 8-2-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:26 | సంచిక: 166 | పేజీలు:4 | వెల: రూ.1/-

బోడో ఒప్పందంతో ఈశాన్యంలో శాంతి :ప్రధాని మోదీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7: ప్రధాని మోదీ ఇవాళ అస్సాంలోని కోక్రజార్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. బోడోలతో ఇటీవల శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో.. అక్కడ భారీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హింస వల్ల శరణార్థులగా మారిన వేలాది మంది ఈశాన్య రాష్ట్ర ప్రజలు.. ఇప్పుడు కొత్త జీవితాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. సంపూర్ణ గౌరవం, హుందాతనంతో వాళ్లకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ప్రధాని అన్నారు. బోడో ల్యాండ్ ఉద్యమంలో పాల్గొని, ప్రజాజీవితంలోకి వస్తున్న ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతున్నట్లు మోదీ చెప్పారు. దాదాపు అయిదు దశాబ్దాల తర్వాత, బోడో ఉద్యమంతో సంబంధం ఉన్న వారికి గౌరవం దక్కిందన్నారు. గత పాలకులు ఈశాన్యాన్ని విస్మరించారని, కానీ తాము బోడో ఒప్పందాన్ని నిజం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు. నిన్న లోక్‌సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆయన మరోసారి గుర్తు చేశారు. కర్రలతో మోదీని కొట్టేందుకు జనం సిద్ధంగా ఉందని రాహుల్ అన్న విషయం తెలిసిందే. అయితే ఆ దెబ్బలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని, పెద్దఎత్తున్న మహిళల అండ తనకు ఉందని మోదీ అన్నారు.

వనదేవతలను దర్శించుకున్న సీఎం కేసీఆర్

ప్రత్యేక హెలికాప్టర్‌లో ఎంపి సంతోష్‌తో కలసి రాక
స్వాగతం పలికిన మంత్రులు
పత్రేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్న కెసిఆర్
చీర, సారె సమర్పణ
మేడారం మొక్కులు తీర్చుకున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి7(నేటినిజం ప్రతినిధి): మేడారం సమ్మక్క, సారలమ్మలను రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దర్శించుకున్నారు. వనదేవతల దర్శనానికి సీఎం ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారానికి చేరుకున్నారు. ఎర్రవల్లి ఫామ్ హౌజ్ పుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఎంపి సంతోష్ కుమార్‌తో కలసి వచ్చారు. ఆయనకు మేడారంలో మంత్రులు

మేడారం గద్దెల వద్ద అమ్మవార్లకు మొక్కుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్

స్వాగతం పలికారు. గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మలను సీఎం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మొదట సమ్మక్క అమ్మవారిని దర్శించుకుని, అనంతరం సారలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడే కొలువై ఉన్న గోవిందరాజు, పగిడిద్ద రాజులను సీఎం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్లకు తెలంగాణ రాష్ట్రం తరపున సీఎం చీర, సారాను సమర్పించారు. అమ్మల దీవెనలు తెలంగాణలోని ప్రతీ బిడ్డ మీద ఉండాలని సీఎం కోరారు. సిఎం కెసిఆర్ రాగానేఆయకు బుట్టలో పెట్టిన కానుకులను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అందించారు. వాటిని తలపై పెట్టుకున్న కెసిఆర్, సంతోష్‌లు అమ్మవారికి సమర్పించారు. సీఎం వెంట మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఉన్నారు. తల్లులకు సీఎం నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు. హుండీలో కానుకలు వేశారు. దర్శనానంతరం దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు సమ్మక్క-సారలమ్మ దేవతల ఫోటో అందజేశారు. అనంతరం ఏరియల్ వ్యూ ద్వారా మేడారం ప్రాంతాన్ని సీఎం పరిశీలించారు. కాగా, దీనికి ముందు ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కు మంత్రులు, అధికారులు, గిరిజన పూజారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ అప్పటికే అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడారం జాతర ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పెరెన్నికగన్న విషయం తెలిసిందే. అశేష భక్తజనం రాకతో మేడారం పరిసరాలు జన సునామీని తలపిస్తున్నాయి.

అక్కన్నపేటలో కాల్పుల కలకలం

ఇంటిగోడ విషయంలో ఇద్దరి మధ్య తగాదా
ఎకె 47తో కాల్పులు..తప్పిన ప్రాణాపాయం
గ్రామంలో పోలీసుల పహరా..పరారీలో నిందితుడు

సిద్దిపేట,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండల కేంద్రంలో అర్ధరాత్రి తుపాకి మోతలు కలకలం రేపాయి. ఏకే 47తో రెండు రౌండ్లు కాల్పులు జరగడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. గుంటి గంగరాజు అనే వ్యక్తిపై దేవుని సదానందం అనే వ్యక్తి ఈ కాల్పులు జరిపాడు. అయితే కాల్పులు మిస్ ఫైర్ కావడంతో గంగరాజుకు ప్రాణాపాయం తప్పింది. కాల్పులు జరిపిన సదానందం ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. సిద్దిపేట, హుస్నాబాద్ ఏసీపీలు, క్లూస్ టీం సహాయంతో సదానందం ఇంటిని తనిఖీ చేశారు. పేలిన తూటాలను స్వాధీనం చేసుకున్నారు. తల్వార్ కత్తి, తుపాకి బెల్ట్, బాడిషా కత్తి, రెండు ఫోన్లు, రెండు బ్యాంక్ అకౌంట్ల ఏటీఎంలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అర్ధరాత్రి నుంచి అక్కన్నపేట పోలీసుల ఆధీనంలో ఉంది. సంఘటన వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన దేవుని సదానందం, గంటి గంగరాజు కుటుంబాల మధ్య మూడు రోజుల క్రితం ప్రహరిగోడ విషయంలో మాట మాట పెరిగి గొడవకు దారి తీసింది. ఈ రోజు మళ్లీ గొడవ ప్రారంభ కాగా ఇంట్లోకి వెళ్లిన సదానందం ఏకే 47తో వచ్చి గంగరాజుపై కాల్పులు జరిపాడు. గంగరాజు తప్పించుకోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. కాల్పులు జరగడంతో గ్రామం అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రెండు బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఏకే 47 గన్ ఎక్కడి నుంచి వచ్చిందని పోలీసులు ఆరాతీస్తున్నారు. గ్రామంలో పోలీసులు భారీగా మోహరించారు. సదానందం గన్‌తో పరారీలో ఉన్నాడు. నిందితుడి కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వివరాలు తెలుసుకుంటున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వనదేవతల సేవలో తరిస్తున్న జనం

అమ్మవార్లను దర్శించుకున్న గవర్నర్లు
దత్తాత్రేయ, తమిళసైల రాక ..స్వాగతం పలికిన మంత్రులు
అమ్మవార్లను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్న తమిళసై
దేవభూమి మేడారం అన్న దత్తాత్రేయ
ఎటుచూసినా మేడారంలో జనసందోహమే
జంపన్న వాగువద్ద స్నానాల కోసం కోలాహలం
ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసుల కృషి

వేడారం,ఫిబ్రవరి7(నేటినిజం ప్రతినిధి): మేడారంలో సమ్మక్క-సారక్క జాతర వైభవోపేతంగా సాగుతోంది. గురువారం రాత్రి గద్దెకు సారక్క చేరడంతో వనదేవతల ప్రవేశం సంపూర్ణం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. శుక్రవారం ఉదయం వనదేవతలను రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ దర్శించుకున్నారు. వనదేవతలను దర్శించుకున్న ఇద్దరు గవర్నర్లు.. అమ్మవార్లకు నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. గవర్నర్ తమిళిసైతో పాటు మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వనదేవతల పూజారులు అమ్మవార్ల ప్రసాదాలను గవర్నర్ తమిళిసైకు అందజేశారు. గవర్నర్ల పర్యటన నేపథ్యంలో మేడారంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వనదేవతలంతా గద్దెలపైనే ఉండడంతో మేడారం జాతరకు భక్తులు పోటెత్తారు. దర్శనాల కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. రెండు రోజుల పాటు గద్దెలపైనే వనదేవతలు ఉంటారు. శనివారం సాయంత్రం అమ్మవార్లు వన ప్రవేశం చేయనున్నారు. వనదేవతలను దర్శించుకున్న అనంతరం గవర్నర్ తమిళిసై మీడియాతో మాట్లాడారు. సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదాలు ఉంటాయని గవర్నర్ పేర్కొన్నారు.

మేడారం జాతర ప్రకృతితో మమేకమందని ఆమె తెలిపారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవార్లను మొక్కుకున్నానని గవర్నర్ చెప్పారు. గిరిజన జాతర గురించి తనకు ముందునుంచీ తెలుసని, అయితే అమ్మవార్లను దర్శించుకోవడంమాత్రం ఇదే తొలిసారని అన్నారు. దర్శనం అనంతరం గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. గిరిజన సంప్రదాయంలో జరిగే మేడారం జాతర దేశంలోనే అతిపెద్దదని కొనియాడారు. వనదేవతలుగా విరాజిల్లుతున్న సమ్మక్క సారలమ్మలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

మేడారాన్ని దేవభూమిగా భావిస్తున్నామని తెలిపారు. గవర్నర్ హోదాలో అమ్మవార్ల ఆశీస్సులు పొందడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి దేవతల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నానని పేర్కొన్నారు. ఇదిలావుంటే భక్తులు భారీగా తరలి వస్తున్నా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు కూడా అప్రమత్తంగా ఉంటూ వారికి దర్శనం కలిగేలా చూస్తున్నారు. ఇకపోతే జంపన్నవాగువద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. బెల్లం ముద్దలు, కొబ్బరికాయలు, పసుపు కుంకుమలతో మొక్కులు తీర్చుకుంటున్నారు. గురువారం రాత్రి చిలుకలగుట్ట నుంచి దిగివచ్చిన వనదేవతను గద్దెపైకి ఆహ్వానించారు. ఎర్రని వస్త్రంలో కుంకుమభరిణ రూపంలో తరలివచ్చిన సమ్మక్కకు.. ఘనంగా నీరాజనం లభించింది. రాత్రి గద్దెమీదకు సమ్మక్క రాకతో వనదేవతల రాక పరిపూర్ణమైంది.

బుధవారం ప్రారంభమైన మేడారం జాతరలో లక్షల మంది పాల్గొంటున్నారు. అమ్మవారి దర్శనాల కోసం వస్తున్న జనాలతో మేడారం జాతర మురిసి పోతోంది. బెల్లం బంగారు నైవేద్యమైంది. కోళ్లు, మేకలు, గొర్రెలు బలిస్తున్నారు. ఇప్పటికే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరుకోగా, గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరడంతో ప్రజలు పులకించి పోయారు. ఈ అద్భుత దృశ్యాన్ని చూసిన మేడారం పులకించిపోయింది. భక్తిపారవశ్యంతో ఊగిపోయింది. ఈ దృశ్యం చూసేందుకు కనీవినీ ఎరుగని రీతిలో చిలుకలగుట్టకు జనగంగ ఉప్పొంగింది. ఇప్పటిదాకా సారలమ్మ దీవెనలు పొందిన జనం ఇక సమ్మక్క ఆశీర్వాదాలు అందుకోనున్నారు. శనివారం సాయంత్రం దేవతలు తిరిగి వనంలోకి వెళ్లిపోయేవరకు జాతర సాగనుంది. అందుకే శుక్రవారం భారీగా జనం తరలి వచ్చారు. అమ్మవార్లకు మొక్కులు తీర్చుకునేందుకు పోటీ పడ్డారు.

మేడారం గద్దెల వద్ద అమ్మవార్లకు మొక్కుకున్న గవర్నర్లు తమిళిసై, దత్తాత్రేయ

సామాన్య భక్తుడిగా మేడారంలో కడియం

సమ్మక్కను దర్శించుకున్న మాజీ డిప్యూటి సిఎం

మేడారం,ఫిబ్రవరి7(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ కుంభమేళా మేడారం జాతరకు భక్తుల తాకిడి ఎక్కువైంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా బిహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు వనదేవతలను దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. మరోవైపు తెలంగాణ మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఓ సాధారణ భక్తుడిలా అమ్మవార్ల దర్శనానికి వెళ్లారు. క్యూలైన్‌లో నిల్చొని, గోడ దూకి సమ్మక్క గద్దెను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 7 సార్లు తన ఆధ్యర్యంలో జాతర నిర్వహించినట్లు గుర్తు చేశారు. వనదేవతల ఆశీర్వాదంతోనే తెలంగాణ సిద్ధించిందనంటారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వేల సంఖ్యలో వాహనాలు, బస్సుల్లో భక్తులు తరలివస్తున్నారు. బీజాపూర్, భూపాల పట్నం, దంతెవాడ, బాసగూడ, బస్తర్, జగదల్‌పూర్, రాయపూర్, భద్రకాళీ, మద్దేడు, ఆవుపల్లి, కాకేడు, కొత్తపల్లి, కుంట, పామేడు తదితర ప్రాంతాల నుంచి వాజేడు మండలం మీదుగా ఏటూరునాగారం, తాడ్వాయి, మేడారం చేరుకుంటున్నారు. వీరంతా మూడు రోజులపాటు జాతరలో బస చేస్తారు. గతంలో గోదావరి దాటి ఎడ్లబండ్లల్లో వచ్చేవారు. ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో సమ్మక్క-సారక్కల గద్దెలు ఉన్నాయి. అక్కడ కూడా దేవతలను మొక్కుకొని మేడారం బయల్దేరుతారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గొత్తికోయలు సైతం వనదేవతలకు మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. సమ్మక్కకు ఆడబిడ్డ కట్నం కింద చీరె, సారెను సమర్పిస్తారు. జాతరకు ముందుగానే గొత్తికోయలు మేడారం చేరుకునేందుకు సన్నద్ధమవుతారు. జాతరకు వెళ్లే ముందు ఇంటిని అలుకుతారు. తలంటి స్నానం చేసి కొత్త బట్టలు వేసుకుంటారు. జాతరకు ముందుగానే ఇతర గ్రామాల్లో ఉన్న తమ కుటుంబ సభ్యులంతా ఒకచోటుకు చేరి అనేక రకాల పిండివంటలు తయారు చేసుకుంటారు. కోళ్లు,మేకలతో గూడేల్లోని వారంతా గుంపులు గుంపులుగా బయల్దేరుతారు. గొత్తికోయలు అనేక రకాలుగా తల్లులకు మొక్కులు సమర్పిస్తుంటారు. ప్రధానంగా పంటలు బాగా పండాలని మొక్కుతుంటారు. అంతేకాకుండా కుటుంబాన్నంతా సల్లంగా చూడాలని, ఆరోగ్యంగా ఉండాలని, కాస్పు రావాలనే కోరికలతో మొక్కులు చెల్లిస్తుంటారు. సమ్మక్క తల్లిని ఆడబిడ్డగా కొలిచి కట్నం కింద సారె, చీరెలు, బెల్లం, ఇప్ప సార, కోడి, మేకలను మొక్కుల కింద చెల్లిస్తుంటారు. అలాగే పిల్లలు పుట్టాలని అమ్మవార్లను కోరుతూ ముడుపులు కడతారు. మేకలను బలిస్తామని మొక్కడంతోపాటు కొబ్బరికాయ, డబ్బులు ముడుపులు కడతారు. జాతర జరిగితే మేడారం వెళ్లి జంపన్నవాగులో స్నానం చేసి కొత్త బట్టలు వేసుకుని ఒడ్డున ఉన్న జంపన్న గద్దె వద్ద మొక్కిన ముడుపు కట్టి సమ్మక్క తల్లికి కోడి, మేకను బలి ఇస్తారు. రెండేళ్లకోమారు వచ్చే జాతరలో కనీసం మూడు రోజులు వన జాతరలోనే ఉంటారు. అక్కడ నిద్ర చేయాలనే ఆచారం వారిలో ఉంది. ఇక అందరూ ఒకచోట చేరిన తర్వాత మొక్కులు ఎలా ఇవ్వాలనేది నిర్ణయించుకుంటారు.

గుత్తికోయలకు సమ్మక్క-సారమ్మ ఆరాధ్యం

జాతర రోజుల్లో మూడు రోజులు ఇక్కడే మకాం
ముడుపు చెల్లించి మొక్కులు కట్టడం ఆచారం

ములుగు,ఫిబ్రవరి7(నేటినిజం ప్రతినిధి): సమ్మక్క-సారలమ్మ జాతరకు అనేక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నా గిరిజన కోయ జాతుల వారికే ఇక్కడి దేవతలు ఆరాధ్య దైవాలుగా నిలిచారు. రాను రాను జాతరకు అన్నివర్గాల ప్రజలు రావడంతో దీనికి ప్రాధాన్యం పెరిగింది. వారి ఆరాధ్య దైవంగా వివిధ ప్రాంతాల గిరిజనులు ఇక్కడికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బీజాపూర్, భూపాల పట్నం, దంతెవాడ, బాసగూడ, బస్తర్, జగదల్‌పూర్, రాయపూర్, భద్రకాళీ, మద్దేడు, ఆవుపల్లి, కాకేడు, కొత్తపల్లి, కుంట, పామేడు తదితర ప్రాంతాల నుంచి వాజేడు మండలం మీదుగా ఏటూరునాగారం, తాడ్వాయి, మేడారం చేరుకుంటున్నారు. వీరంతా మూడు రోజులపాటు జాతరలో బస చేస్తారు. గతంలో గోదావరి దాటి ఎడ్లబండ్లల్లో వచ్చేవారు. ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో సమ్మక్క-సారక్కల గద్దెలు ఉన్నాయి. అక్కడ కూడా దేవతలను మొక్కుకొని మేడారం బయల్దేరుతారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గొత్తికోయలు సైతం వనదేవతలకు మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. సమ్మక్కకు ఆడబిడ్డ కట్నం కింద చీరె, సారెను సమర్పిస్తారు. జాతరకు ముందుగానే గొత్తికోయలు మేడారం చేరుకునేందుకు సన్నద్ధమవుతారు. జాతరకు వెళ్లే ముందు ఇంటిని అలుకుతారు. తలంటి స్నానం చేసి కొత్త బట్టలు వేసుకుంటారు. జాతరకు ముందుగానే ఇతర గ్రామాల్లో ఉన్న తమ కుటుంబ సభ్యులంతా ఒకచోటుకు చేరి అనేక రకాల పిండివంటలు తయారు చేసుకుంటారు. కోళ్లు,మేకలతో గూడేల్లోని వారంతా గుంపులు గుంపులుగా బయల్దేరుతారు. గొత్తికోయలు అనేక రకాలుగా తల్లులకు మొక్కులు సమర్పిస్తుంటారు. ప్రధానంగా పంటలు బాగా పండాలని మొక్కుతుంటారు. అంతేకాకుండా కుటుంబాన్నంతా సల్లంగా చూడాలని, ఆరోగ్యంగా ఉండాలని, కాస్పు రావాలనే కోరికలతో మొక్కులు చెల్లిస్తుంటారు. సమ్మక్క తల్లిని ఆడబిడ్డగా కొలిచి కట్నం కింద సారె, చీరెలు, బెల్లం, ఇప్ప సార, కోడి, మేకలను మొక్కుల కింద చెల్లిస్తుంటారు. అలాగే పిల్లలు పుట్టాలని అమ్మవార్లను కోరుతూ ముడుపులు కడతారు. మేకలను బలిస్తామని మొక్కడంతోపాటు కొబ్బరికాయ, డబ్బులు ముడుపులు కడతారు. జాతర జరిగితే మేడారం వెళ్లి జంపన్నవాగులో స్నానం చేసి కొత్త బట్టలు వేసుకుని ఒడ్డున ఉన్న జంపన్న గద్దె వద్ద మొక్కిన ముడుపు కట్టి సమ్మక్క తల్లికి కోడి, మేకను బలి ఇస్తారు. రెండేళ్లకోమారు వచ్చే జాతరలో కనీసం మూడు రోజులు వన జాతరలోనే ఉంటారు. అక్కడ నిద్ర చేయాలనే ఆచారం వారిలో ఉంది. ఇక అందరూ ఒకచోట చేరిన తర్వాత మొక్కులు ఎలా ఇవ్వాలనేది నిర్ణయించుకుంటారు.

చైనాలో పెరుగుతున్న కరోనా మృతులు

636కు చేరుకున్న మృతిచెందిన వారి సంఖ్య
30వేలకు పైగా కరోనా బాధితులు

బీజింగ్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): చైనాలో కరోనా వైరస్ మరణాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. చైనాలో కరోనా వల్ల మృతిచెందిన వారి సంఖ్య 636కు చేరుకున్నది. ఆ వైరస్ సోకిన వారి సంఖ్య 30 వేలు దాటింది. శుక్రవారం మరో 73 మంది మృతిచెందినట్లు జాతీయ ఆరోగ్య శాఖ వెల్లడించింది. కరోనా వైరస్ పుట్టిన ప్రాంతమైన హుబేయ్ ప్రావిన్సులో అత్యధిక స్థాయి మరణాలు నమోదు అవుతూనే ఉన్నాయి. మరోవైపు అక్కడ కరోనా నివారణ చర్యలు తీవ్రం చేశారు. ఈ వ్యాధి సోకినట్లుగా నిర్ధారణ అయిన వారి సంఖ్య 30వేలకు పైగా చేరుకుందని చైనా ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. దేశంలోని దాదాపు 31 ప్రావిన్సుల పరిధికి వ్యాధి విస్తరించిందని, బుధవారం మరణించిన 73 మందిలో ముగ్గురు మినహా మిగిలిన వారందరూ హుబే ప్రాంతం వారని జాతీయ ఆరోగ్య కమిషన్ ప్రకటించింది. 10రోజుల్లో ఆసుపత్రిని కట్టిన చైనా వుహాన్‌లో మరో ఆసుపత్రినికి కట్టింది. 1500 పడకలున్న ఈ ఆసుపత్రిలో త్వరలో వైద్యసేవలు ప్రారంభంకానున్నాయి. వుహాన్ సిటీ నుంచి ఢిల్లీకి చేరుకున్న 645 మందిలో ఏ ఒక్కరికీ వైరస్ సోకలేదని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ వ్యాప్తిపై చైనా దేశ ప్రజలను అప్రమత్తం చేసిన ఎనిమిదిమంది వైద్యుల్లో ఒకరైన లీ వెన్‌లియాంగ్(34) చివరికి అదే వ్యాధితో కన్నుమూశారు. గత డిసెంబర్‌లో వుహాన్‌లోని వైద్య కళాశాలకు వచ్చిన రోగుల్లో ఈ వ్యాధి లక్షణాలను గుర్తించిన ఈయన తన సన్నిహితులను అప్రమత్తం చేయడానికి వుయ్‌చాట్ ఆప్‌లో ఆ వివరాలను ఉంచారు. చివరికి ఆ మెసేజీ ద్వారా అందరికీ ఈ విషయం తెలిసిపోయింది. దీంతో ప్రభుత్వం వదంతులను వ్యాపింపజేస్తున్నారంటూ లీపై కక్షకట్టింది. చివరికి డాక్టర్ లీకి కూడా ప్రాణాంతక వైరస్ సోకి పరిస్థితి విషమించడంతో వుహాన్‌లో కన్నుమూశారు.కరోనా వైరస్‌తో గడగడలాడుతున్న చైనా.. ప్రజలకు వింత ఆదేశం ఇచ్చింది. ముఖ్యంగా కరోనా కేంద్ర బిందువైన వూహాన్‌లోని ప్రజలకు ఈ ఆర్డర్ వేసింది. ఇక నుంచి వూహాన్‌లోని ప్రజలంతా ప్రతిరోజూ తమ బాడీ టెంపరేచర్‌ను అధికారులకు తెలియజేయాలి. అంటే ఈ ప్రాంత వాసులు ప్రతిరోజూ తమకు జ్వరం వచ్చిందేమో చెక్ చేసుకొని, ఈ విషయాన్ని అధికారులకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఒకవేళ ఊహించని విధంగా ఎవరిలోనైనా విపరీతమైన జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే స్పందించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. ఎవరికైనా ఇలా జ్వరం వస్తే మున్సిపల్ హెల్త్ అధికారులు సదరు వ్యక్తికి కరోనా పరీక్షలు నిర్వహిస్తారని, వాటి ఫలితాలను బట్టి చికిత్స కూడా అందిస్తారని ప్రభుత్వం తెలిపింది. మృతుల సంఖ్య పెరుగుతున్న క్రమంలోనే తాము ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

మాజీ సిఎంలు మెహబూబా,ఒమర్ అబ్దుల్లాలపై కేసులు

ఇద్దరిపైనా పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ కేసుల నమోదు

శ్రీనగర్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్ మాజీ సీఎంలు మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాలపై ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఇద్దరిపైనా పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ కేసులను పెట్టారు. వీరితో పాటు నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన కీలక నేతలపైన కూడా కేసులు దాఖలు వేసినట్లు తెలుస్తోంది. పోలీసులతో కలిసి మెహబూబా ముఫ్తీ ఇంటికి వెళ్లిన మెజిస్ట్రేట్.. పీఎస్ఏ నోటీసులను జారీ చేశారు. సెక్షన్ 107, 151 కింద ఇద్దరు నేతలపై కేసు బుక్ చేశారు. గత ఆగస్టులో ఆర్టికల్ 370ని రద్దు చేసిన నేపథ్యంలో.. కశ్మీర్‌లో అనేక మంది నేతలను గృహ నిర్బంధం చేసిన విషయం తెలిసిందే. జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా(నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తీ(పీడీపీ)లపై కఠినమైన ప్రజా భద్రత చట్టం కింద గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. వారిద్దరి ఆరు నెలల ముందస్తు నిర్బంధం ముగియడానికి కొన్ని గంటల ముందు వారిపై ఈ కేసు పెట్టడం గమనార్హం. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేసిన 2019, ఆగస్ట్ 5వ తేదీ నుంచి ఆ ఇద్దరు నేతలు గృహ నిర్బంధంలో ఉన్న విషయం తెలిసిందే. పోలీసులతో పాటు వచ్చిన మెజిస్ట్రేట్ సంబంధిత నోటీసులను వారి నివాసాల్లో ఆ ఇద్దరు నేతలకు అందించారు. ఆ ఇద్దరితో పాటు శ్రీనగర్‌లో మంచి పట్టున్న నేషనల్ కాన్ఫరెన్స్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి అలీ మొహమ్మద్ సగర్‌పై, పీడీపీ కీలక నేత సర్తాజ్ మదానీపై కూడా పీఎస్ఏ కింద నోటీసులు జారీ చేశారు. మదానీ మెహబూబా ముఫ్తీకి మామ అవుతారు. పీఎస్ఏలోని 'పబ్లిక్ ఆర్డర్' సెక్షన్ ప్రకారం విచారణ లేకుండా ఆరు నెలలు, 'రాజ్య భద్రతకు ప్రమాదం' అనే సెక్షన్ ప్రకారం విచారణ లేకుండా రెండు సంవత్సరాల వరకు అనుమానితులను నిర్బంధంలో ఉంచవచ్చు. ఈ చట్టం ఒమర్ అబ్దుల్లా తాత షేక్ అబ్దుల్లా హయాంలో 1978లో రూపొందింది. ముఖ్యంగా కలప స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు ఈ చట్టాన్ని రూపొందించారు.

మలాలాపై కాల్పులు జరిపిన ఉగ్రవాది పరార్

లాహోర్,ఫిబ్రవరి7 (ఆర్ఎ న్ఎ): పాకిస్థాన్‌కు చెందిన నోబెల్ బహుమతి గ్రహీత మలాలా యూసుఫ్‌జాహిని.. షూట్ చేసిన తాలిబన్ ఉగ్రవాది ఇషానుల్లా ఇషాన్ జైలు నుంచి తప్పించుకున్నాడు. 2014లో పెషావర్‌లో ఆర్మీ స్కూల్‌పై జరిగిన దాడికి కూడా ఈ ఉగ్రవాదే బాధ్యుడు. తాజాగా రిలీజైన ఆడియో క్లిప్‌లో.. తాను పోలీసుల చెర నుంచి తప్పించుకున్నట్లు ఉగ్రవాది ఇషాన్ చెప్పాడు. సోషల్ మీడియాలో ఇప్పుడు ఆ క్లిప్ వైరల్ అవుతోంది. జనవరి 11న పోలీసుల అదుపు నుంచి బయటపడినట్లు అతను తెలిపాడు. 2017లో పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. అయితే తనకు ఇచ్చిన వాగ్దానాన్ని పోలీసులు నెరవేర్చలేదన్నాడు. 2012లో పాక్‌లోని స్వాట్ వ్యాలీలో విద్యా హక్కుల గురించి ప్రచారం చేస్తున్న సమయంలో మలాలాపై ఉగ్రవాది ఇషాన్ కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో మలాలా తలలోకి బుల్లెట్ దిగింది.

చరిత్రలో నేటినిజం

నిజమైనప్రతిభ లోపల
ప్రజలకు సంతోషమొసగు ప్రతిభామయుడై
విజయము సాధించు" మహామ
ధజమారు ఉద్భవిను"గౌతమ సభినందనలనే!!

ఫిబ్రవరి 8 మహమ్మద్ జహరుద్దీన్ జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

అర్టీసీ క్రాస్‌రోడ్డులో లారీ బీభత్సం

బైకును ఢీకొనడంతో విద్యార్థి దుర్మరణం

హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు కాలేజీ విద్యార్థులను హెచ్‌పీ గ్యాస

ఏకాంతం ఒక వరం..!!

మనిషికి మనసు ఒక వరం. మనసుకు చింతన ఒక శాపం. ఒక్కోసారి మనసు మానస సరోవరం అయితే, ఒక్కోసారి సరస్సులకు రహదారిగా మారి పుష్పక విమానమవుతుంది. ఆలోచన అలజడి జీవితా నౌకను కుదిపేస్తున్న సమయంలో కుదురు కోసం ప్రతి మనిషి కోరుకునేది ఏకాంత వాసాన్నే! అలకలు పులకలు తీరేవేళ మనసు కూపస్థ మండూకమయితే చిత్రాల చింత ఒకింత తీరేదాకా కోపగృహవాసానికి పూర్వకాలంలో వెసులుబాట్లు ఉండేవట. ఎవరి ఏడుపు వారిని ఏడవనిచ్చే ఏకాంత సౌలభ్యం ఇప్పుడెక్కడ? ఆనందానికి హద్దులు లేవు. హృదిని కరిగించి మరిగించే విషాద భరిత స్థితికి ఏకాంతమే కూడలి స్థలి. తనను వీడి వెళ్ళిన మోహన మూర్తిని తలిచి వగచి వగచి అశ్రుధారలో సొమ్మసిల్లిన యశోధరది ఏకాంతమే! ప్రాణనాధుని నిష్క్రమణతో అంతఃపుర మందిరానికే పరిమితమయిన నిద్రాముద్రిత రాకుమారి ఊర్మిళాదేవిదే ఇదే పరిస్థితి.

నేటినిజం
శనివారం 8-2-2020

కావ్యరచనకు అనువూ నెలవూ ఏకాంతమన్నది నాటి అల్లసానివారి భావమైతే ఏకాంతంగా ఆకాశాంలో వీక్షించేను. దేహాలు ఒక్కచోటే నివసిస్తాయి కానీ మనసులు మాత్రం ప్రపంచాన్ని చుట్టి వస్తాయి. అందులోనే అనేకానేక మాటలు, ధ్వనులు భాషలూ! ఇక ఏకాంతమంటే ఏమిటి? నలుగురిలోనికి చేరకుండా దూరంగా ఉండటమా? లేక ఒంటరి తనాన్ని అలవాటు పడటమా? మోదమంటే లభించేది, ప్రమోదమంటే అనుభవించేది వీటి మధ్య వెల్లివిరిసే ఆనందోత్సాహాల్ని నలుగురితోనూ పంచుకోవాలనుకుంటాడు మనిషి. అప్పటి అనుభూతిని మాత్రం ఒక్కడే స్మరించుకుంటాడు.

గదిలో ఒక్కరే ఉంటే అది ఏకాంతం కాదు. ఎందుకంటే ఆ ఏకాంతానికి కాస్తంత భంగం కలిగినా భరించలేరెవ్వరూ. గదిలో ఉన్నపుడు చుట్టూ ఆవరిస్తుంది ఏకాంతం.

దాటగానే మనల్ని మనమే కాదనుకుని సమాజంలో కలసిపోతాము. ఏకాంతం అనేది స్థిరచిత్తాన్ని కలుగజేస్తుంది. ఎంతోమంది ఇష్టపడే ఏకాంతాన్ని మనమే ఒక్కోసారి భగ్నం చేస్తాము. ఈ యాంత్రిక యుగంలో కాల ప్రవాహంలో కాస్తంత శాంతి విశ్రాంతి అందించేది ఏకాంతంలోనే కదా? నిత్యం జీవిత భ్రమణంలో అనేకానేక అనుభవాల్ని పొందే ఎవ్వరికైనా ఎక్కడో ఒక దగ్గర ఎంతోకొంత సమయం ఏకాంత చిత్తులు కాగలిగితే సరికొత్త జవమూ జీవమూ ప్రాప్తిస్తుందని సారాంశం. పరిశీలించి చూడాలే కానీ సోమసుందర్ కలం పలికినట్లు పరమాణువు కన్నా యెడద నిజం సుమా అన్నట్లు / లేడికి లేచిందే పరుగు అన్నట్లు క్షణం తీరిక లేకుండా గడిపే యుతకు ఏకాంతత్వమే ఉత్తమ ఫలదాయకమని సామాజిక పరిశీలకుల విశ్లేషణలు ఇపుడే వెల్లడించాయి. ఆ రీత్యా చూసినపుడు ఎవరికైనా ఏకాంతమే ఆత్మంధువు అనుకుంటారేమో! కానీ ఏకాంతం అనేది మనల్ని మనకు తెలిపేది. ఏకాంతం అనేది అనుకూలంగా మార్చుకుంటే మనకోసమే మిగిలేది. ఏకాంతంతో మునులు, ఋషులు సాధించేది చాలా ఉంటుంది. ఏకాంతం అనేది ఒక శక్తి. మాటల మధ్య మనం కోల్పోయిన ఆత్మీయతలెన్నో! ఏకాంతంలో అలవడిన మౌనంతో సాధించే అనుభూతులెన్నో!!

నాటుసారా తయారీలో ఆరితేరిన వ్యాపారులు

–నల్లబెల్లం స్థానే తెల్లబెల్లం అమ్మకాలు

ఖమ్మం,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): నాటుసారా తయారీలో ఉపయోగిస్తున్న నల్లబెల్లంను పూర్తిస్థాయిలో అడ్డుకోవడంతో వీరి కన్ను తెల్లబెల్లంపై పడింది. ఇప్పుడు దీంతో దందా సాగిస్తున్నట్లు సమాచారం.

అధికారులు దీనిపై దృష్టి సారించకపోడంతో తయారీ, విక్రయాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. నల్లబెల్లం మాదిరిగానే తెల్లబెల్లంను నీటిలో కలుపుతున్నారు. గుంతలో కొంతకాలంపాటు నిల్వ చేస్తారు. బాగా పులిసిన తర్వాత బట్టీలను ఏర్పాటు చేసి గుడుంబాను తయారు చేస్తున్నారు. నిషేధం మాటున గుడుంబాకు ధరనూ విపరీతంగా పెంచారు. గుడుంబా పూర్తిగా నిషేధించినా గ్రామాల్లో దొరుకుతూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో నల్లబెల్లం కూడా దొరుకుతోంది. నల్లబజారులో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో తెల్లబెల్లంను వినియోగిస్తున్నారు. చర్ల, దుమ్ముగూడెంలో మాత్రం ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. ఇక్కడ కేవలం చక్కెరతోనే సారా తయారు చేస్తున్నారు. నలభైశాతం మళ్లీ సారా వ్యాపారం పెరిగింది. ఏన్కూరు, తల్లాడ, కొణిజర్ల, మధిర, కారేపల్లి, నేలకొండపల్లి, ఖమ్మం పట్టణం, గ్రామీణం, చింతకాని వంటిచోట్ల సారా విక్రయాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రతిస్టేషన్ పరిధిలో సారా మళ్లీ జడలు విప్పుకుంది. గతంలో నల్లబెల్లంతో సారాను కాసేవారు. దీనిపై ఉక్కుపాదం మోపడంతో తెల్లబెల్లాన్ని ఆశ్రయిస్తున్నారు. సాక్షాత్తూ ఆబ్కారీశాఖాధికారులు దీనిని ధ్రువీకరించారు. ఇంటి అవసరాలకు, వంటలకు ఉపయోగించే తెల్లబెల్లంను కొందరు వ్యాపారులు, దుకాణదారులు పక్కదోవ పట్టించడం మొదలుపెట్టారు. సారా తయారీదారులు అవకాశం ఉన్న చోట్ల క్వింటాళ్లుగా దీనిని కొనుగోలు చేయడం, అవకాశం లేనిచోట పలువురిని పంపించి ఐదు నుంచి 10 కేజీల చొప్పున కిరాణ దుకాణాల్లో కొనడం ప్రారంభించారు. ఇలా ఏదో ఒకమార్గంలో తెల్లబెల్లాన్ని సారా తయారీలో వినియోగించేందుకు కొనుగోలు చేయడం మాత్రం తగ్గడం లేదు. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, టేకులపల్లి, అశ్వాపురం, పాల్వంచ పరిసర గ్రామీణ ప్రాంతంల్లో గుడుంబా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దాదాపుగా అందరూ తెల్లబెల్లంను విక్రయిస్తున్నారు. ఖమ్మంలోని ఓ ప్రధాన సెంటర్లో తెల్లబెల్లం విక్రయాలు హోల్‌సేల్ పద్ధతిలో భారీగా జరుగుతాయి. కార్పొరేషన్ పరిధిలోనే ఇటీవల ఆబ్కారీశాఖ అధికారులు సుమారు నాలుగున్నర టన్నుల తెల్లబెల్లంను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. నేరుగా అక్రమ మార్గంలోకి పంపించడం, హోల్‌సేల్ నుంచి కిరాణ దుకాణాలకు అక్కడ నుంచి తెలివిగా అవసరమైన వారికి చేరవేసే తంతు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోంది. ఖమ్మం పట్టణంతోపాటు వైరా, కల్లూరు, ఏన్కూరు, నేలకొండపల్లి వంటి ప్రాంతాలతోపాటు ఇతర ప్రాంతాలకు దీనిని తరలిస్తున్నారు. కల్లూరు, కొణిజర్ల, కూసుమంచి, మధిర, సత్తుపల్లి వంటిచోట్ల నెలకు కిరాణదుకాణాల నుంచి ఐదు టన్నుల వరకు అమ్మకాలుంటాయి. సారా తయారీకి పెద్దమొత్తంలోనే తరలుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మహారాష్ట్ర మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

అత్యాచారంచేసి హత్య చేసినట్లు నిర్ధారణ

తమిళనాడుకు చెందిన సాధువు అరెస్ట్

నాగర్‌కర్నూలు,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): అమ్రాబాద్ మండలంలోని అక్కమహాదేవి గుహల సమీపంలో ఈ నెల 2న హత్యకు గురైన మహారాష్ట్ర మహిళ (52) కేసును పోలీసులు ఛేదించారు. తమిళనాడుకు చెందిన ఓ సాధువు ఆమెపై అత్యాచారానికి పాల్పడి ఆపై దారుణంగా హత్యచేసినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి విచారించడంతో హత్య చేసినట్లుగా ఒపపుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లమల అటవీ ప్రాంతంలోని అక్కమహాదేవి గుహలకు చేరుకునే మార్గంలో ఈ నెల 2న ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఆ సమీపంలోనే క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉండడంతో దీనిని నరబలిగా అనుమానించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళ మృతదేహం పక్కనే పడివున్న ఆధార్‌కార్డును బట్టి ఆమె మహారాష్ట్రలోని థానే వాసిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తిరుపతి వెళ్తున్నట్టు చెప్పి జనవరి 25న ఆమె ఇంటి నుంచి వెళ్లినట్టు వారు చెప్పారు. దీంతో ఆమె మొబైల్ నంబరు సిగ్నల్స్ ఆధారంగా ఆమె ఎక్కడెక్కడికి వెళ్లిందో ఆరా తీశారు. అలాగే, సీసీటీవీ ఫుటేజీలనూ పరిశీలించిన పోలీసులకు కీలక ఆధారం లభ్యమైంది. తమిళనాడుకు చెందిన రామకృష్ణ అలియాస్ మట్టస్వామి అనే సాధువుతో కలిసి వెళ్లినట్లు గుర్తించి నిన్న అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో నిందితుడు అసలు నిజం ఒప్పుకున్నాడు. ఆమెపై అత్యాచారం చేసి హత్య చేసినట్టు వాంగ్మూలమిచ్చాడని పోలీసులు తెలిపారు.

యూపిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం

లక్నో,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): యూపీలో భారీ మొత్తంలో మత్తుపదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొరాదాబాద్ జిల్లా గోవింద్ నగర్ ప్రాంతంలో జస్విర్ సింగ్ అనే వ్యక్తి వద్ద డ్రగ్స్ ఉన్నట్లు సమాచారమందుకున్న యూపీ నార్కోటిక్ బ్యూరో, పోలీసులు ఆకస్మిక దాడులు చేపట్టారు. తనిఖీల్లో రూ.5 లక్షల విలువైన మత్తుపదార్థాలను సీజ్ చేశాం. వీటిలో 24వేల ట్రమడోల్ హైడ్రోక్లోరైడ్ మాత్రలున్నట్లు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. కెమిస్ట్ షాపును నిర్వహిస్తున్న జస్విర్ సింగ్ స్థానిక ప్రజలకు డ్రగ్స్ అమ్ముతూ వారిని మత్తుపదార్థాలకు బానిసలుగా చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. జస్విర్‌సింగ్‌ను అదుపులోకి తీసుకున్నాం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మాస్ కాపీయింగ్‌పై విచారణ

టీచర్లపై చర్యలను సమీక్షించాలి

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ వినతి

హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): కిందటి సంవత్సరం ఎస్ఎస్సీ పరీక్షల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలో పరీక్ష విధులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై తీసుకున్న తీవ్ర క్రమశిక్షణా చర్యలను సమీక్షించాలని పాఠశాల విద్య రీజినల్ డైరెక్టర్‌కు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్‌పీసీ) కోరింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని కొన్ని ఎస్సెస్సీ కేంద్రాల్లో కాపీయింగ్ జరుగుతున్నట్లుగా హైదరాబాద్ స్పెషల్ స్క్వాడ్ గుర్తించింది. ఈ క్రమంలో పన్నెండు మంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో పాటు క్రమశిక్షణా చర్యలకు సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో... మహబూబ్‌నగర్ డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన నివేదిక నేపథ్యంలో... అలీదా బేగం అనే ఓ ఎస్టీటీ ఉపాధ్యాయురాలిని సర్వీసు నుంచి తొలగించారు. మరో ఏడుగురు ఉపాధ్యాయులకు సంబంధించి మూడు ఇంక్రిమెంట్లను శాశ్వతంగా నిలిపివేశారు. ఈ ఉత్తర్వులు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. అయితే ఈ చర్యల నేపథ్యంలో... ఎస్సెస్సీ పరీక్షా విధులను నిర్వహించేందుకు ఉపాధ్యాయులు మానసికంగా సిద్ధపడే పరిస్థితి లేదని యుఎస్‌పీసీ పేర్కొంది. ఆయా ఉపాధ్యాయులపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను సమీక్షించాలని, ఉపాధ్యాయుల అభ్యర్థనలను సానుభూతితో పరిశీలించాలని, తీవ్రమైన దండనలను రద్దు చేయాలని యుఎస్‌పీసీ నేతలు కోరారు. ఆర్‌జేడీకి ఈ మేరకు ఓ వినతిపత్రాన్ని అందించారు.

లక్ష్యం చేరని ఉపాధిహామీ పథకం

హైదరాబాద్, ఫిబ్రవరి 7:గ్రామీణ నిరుపేదలకు కూలీ కల్పించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకం లక్ష్యం నెరవేరడం లేదు. సిబ్బంది నిర్లక్ష్యం.. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేమితో ఉపాధి పథకం నీరుగారిపోతోంది. ఓ పక్క గ్రామాల్లో కూలీ దొరక్క అల్లాడుతున్న పేదలకు నిరాశను మిగిలిస్తోంది. కూలీ దొరకడం లేదని కూలీలు అంటున్నారు. కూలీలు దొరక్క అసహ్యలు పడుతున్నామని రైతులు అంటున్నారు. గ్రామాల్లో ప్రజలు కూడా ఇదే బాధను వ్యక్తం చేస్తున్నారు. మరి వీరంతా ఏమవుతున్నారు. ఎక్కడ లోపం ఉంది. ఎక్కడ సమన్వయం లోపించింది. అన్నదే అంతుచిక్కని వ్యవహారంగా ఉంది. ప్రధానంగా కేంద్రరాష్ట్రాల మధ్య సమన్వయం కుదరడం లేదు. పనుల విషయంలో ప్రణాళికలు లేవు. వేలాది కోట్లు ఉపాధిహామీలో వెచ్చిస్తున్నా బూడిదలో పోసిన పన్నీరులా తయారయ్యింది. గ్రామాల్లో పనులు దొరక్క.. చేతిలో డబ్బులు లేక..నిత్యావసర సరకులు కొనలేక ఇబ్బందులు పడుతున్న అనేకమంది పేదలకు పనులు కల్పించి ఆర్థిక భరోసా అందించాలనే ఉద్దేశంతో కేందప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రారంభంలో కొన్ని పనులకే పరిమితమైన ఈ పథకం.. 52రకాల పనులకు ఈ పథకాన్ని వర్తింపజేసింది. గ్రామాల్లో నీటి సంరక్షణ కోసం చేపడుతున్న పనులు, వ్యవసాయ బావుల నిర్మాణం, ఇంకుడుగుంతలు, మట్టికట్టలు, బావుల పూడికతీత, నాడేపు కంపోస్టు, వర్మీకంపోస్టు నిర్మాణాలు, వంట గదులు, పాఠశాలల మరుగుదొడ్లు, శ్మశానవాటికలు తదితర వాటిని చేపట్టాల్సి ఉంది. పనులు చాలా ఉన్నప్పటికీ.. వాటిని చేయించడంలో గ్రామీణ స్థాయిలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పాటు ప్రభుత్వం నుంచి ఉపాధిహామీ డబ్బులు సైతం సకాలంలో రాకపోవడంతో కూలీలు ఈ పనులకు వెళ్లేందుకు అనాసక్తి చూపుతున్నట్లు సమాచారం. పనులకు సాంకేతికత కూడా తోడుకావడంతో నిబంధనల మేరకు పనులు చేయాల్సి ఉంటుంది. ఉపాధి పనుల కోసం కోట్లలో నిధులు కుమ్మరించినా కూలీలకు చేతినిండా పనులు కల్పిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని అనేక సర్వేలు వెల్లడించాయి. ఉపాధిహామీ పథకం అక్రమాలకు పుట్టగా తయారైనా, సమన్వయం లేని పథకంగా మారినా కేంద్రం మాత్రం దీనిపై సమీక్ష చేయడం లేదు. కేవలం పేదలకు భృతి కల్పిస్తున్నామని చెప్పి వేలకోట్ల రూపాయలను వృథా చేస్తున్నారు. నిజానికి ఈ పథకాన్ని రాష్ట్రాలకు అనుసంధానం చేసివుంటే బాగుండేది. ఈ పథకం కింద నిధులు, విధులు రాష్ట్రాలకు అప్పగించి, కేంద్రం అజమాయిషీ చేస్తే బాగుండేది. దీంతో గ్రామాల్లో పనులు జరగడంతో పాటు, అభివృద్ధి కనిపించేది. పాధిహామీ పథకంలో భాగంగా వివిధ శాఖల్లో చేపట్టబోయే పనులపై ఆ శాఖ అధికారులకు, ఉపాధిహామీ అధికారులకు సమన్వయం కోసం సంబంధిత శాఖల అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించాలని జిల్లాస్థాయి అధికారులు సూచించారు. ఈ పనులు చేయించేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ పథకాన్నిపూర్తిగా రాష్ట్రాలకే వదిలేసి కేంద్రం నేరుగా నిధులు విడుదల చేస్తే అనుకున్న ఫలితం రాబట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. ఇకపోతే ఉపాధిహామీలో ప్రవేశపెట్టిన వందరోజుల పని కొందరికే పరిమితమవుతోంది. క్షేత్రస్థాయిలో పనులు కల్పించకపోవడంతో అనేక మంది పల్లె ప్రజలు ఇందుకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో నెలన్నర మాత్రమే గడువు ఉంది. కానీ మిగిలిపోయిన పనిదినాలు చాలా ఉండటంతో ఈ ఏడాది వందరోజుల పని అసంపూర్తిగానే మిగిలిపోనుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీటిని సమన్వయం చేసుకుని ముందుకు సాగితే తప్ప పథకం లక్ష్యం నెరవేరదు. గతంలో కుటుంబంలోని అందరు వ్యక్తులు ఈ పనులకు హాజరయ్యేవారు. అప్పట్లో ఈ పనులు తూతూమంత్రంగా చేయడం వల్ల ఆశించిన ఫలితం రాలేకపోయింది. క్రమంగా ఈ పనులపై ప్రభుత్వం నిశితంగా దృష్టి సారిస్తుండటంతో పాటు అనేక పనులకు ఉపాధిహామీని జోడించింది. గ్రామాల్లో చేపడుతున్న దాదాపు అన్ని రకాల పనులు వీటి ద్వారానే చేపడుతుండటం ఈ పథకం ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. కేంద్రం, రాష్ట్రాలు వేర్వేరుగా ఆలోచన చేసే బదులు ఉమ్మడిగా ఆలోచన చేసి పథకాలను రూపొందిస్తే ప్రజాధనం వృధాకాకుండా అరికట్టడంతో పాటు అవసరమైన పనులు చేయగలుగతాం. ఇప్పటికే విద్య, పశువైద్యం, వ్యవసాయం, నీటి పారుదల, పంచాయతీ రాజ్ శాఖల పనులకు పథకంను అనుసంధానించగా, భవిష్యత్తుల్లో పరిపాలన పరమైన సాధారణ నిధులకు సైతం ఇదే పద్ధతిని అనుసరించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పై శాఖల్లో చేపట్టేందుకు అవసరమైన పనులు, నిధుల వివరాలను వెల్లడించి పనుల ఎంపికకు మార్గదర్శకాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో అవసరమైన పనులు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరింది. ఏ పని చేపట్టినా గ్రామ స్థాయిలో గ్రామసభ నిర్వహించి గ్రామసభ తీర్మానంతో కూడిన ప్రతిని సంబంధిత శాఖ అధికారుల పరిశీలనకు పంపి వారి అనుమతితో నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలి. అలా కాకుండా రాష్ట్రాల అజమాయిషిలో పక్కాగా ప్లాన్ చేసివుంటే ప్రజాధనం వృధా అయ్యేది కాదు. ఇటు కేంద్ర, అటురాష్ట్ర నిధులు ఆదా అయ్యేవి. అయితే ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల్లో భాగంగా ఆయా శాఖల వారీగా కేటాయించే నిధుల్లో ఇక నుంచి ఉపాధిహామీ పథకం నుంచి 45 శాతం నిధులు కేటాయిస్తుండగా ఆయా శాఖల నుంచి 55 శాతం నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

గ్రామీణాభివృద్ధికి ఉపాధి కావాలి

పథకం అమలులో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉండాలి

హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో హరితహారం,నీరు–చెట్టు, చెరువుల పునరుద్ధరణ, మిషన్ కాతీయ, ప్రాజెక్టుల నిర్మాణం, ఇళ్ల నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాలు అన్ని రాష్ట్రాల్లో సాగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఇలాంటి కార్యక్రమాల ను ఉపాధి మామీ పథకంతో జోడిస్తే డబ్బు ఆదా కావడంతో పాటు, పనులు జరిగేవి. ఈ కార్యక్రమంపై పుంఖానుపుంఖాలుగా విమంశలు వస్తున్నా సమీక్షంచడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆయా శాఖలో చేపట్టే పనులకు ఉపాధిహామీ నిధులు మళ్లించే ప్రయత్నంలో భాగంగా పథకంతో పలు శాఖలను అనుసంధానిస్తూ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇక ముందు ఆయా శాఖల్లో కొత్తగా చేపట్టే పనులకు ఉపాధిహామీ అధికారులతో పాటు మిగతా శాఖల అధికారులు కలిసి సమన్వయంతో ముందుకు సాగితేనే సత్ఫలితాలు లభిస్తాయి. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతుల్లో భాగంగా మొదటి ప్రాధాన్యం కింద మూత్రశాలలు, మరుగుదొడ్లు, వంట షెడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసింది. వంటషెడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయనుంది. ఇందులో ఉపాధిహామీ పథకం నుంచి 45 శాతం నిధులు మంజూరు చేస్తుండగా, పనుల అవసరాన్ని బట్టి మిగతా నిధులు సర్వశిక్ష అభియాన్ నుంచి పొందాల్సి ఉంటుంది. ఈ పనులను మండల విద్యాధికారి, పీఆర్ ఏఈల పర్యవేక్షణలో చేపడతారు. పశు సంవర్ధక శాఖలో చేపట్టనున్న పనుల కు గ్రామ సభ తీర్మానం చేసిన ప్రతిని సంబంధిత మండల పశు వైద్యాధికారికి సమర్పించి వారి అనుమతితో పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలి. ఆసక్తి గల రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ, పశువైద్యాధి కారులను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలి. పంచాయతీరాజ్ శాఖలో వైకుంఠ ధామం, ధాన్యం రాశుల ఎండటంకోసం ప్లాట్‌ఫారంతో పాటు ఇతర పనులు చేసుకునే అవకాశముంది. ప్రతి గ్రామ పంచాయతీలో అన్ని వర్గాల వారికి ఉపయోగపడేలా ప్రభుత్వమే ప్రతి గ్రామంలో కొత్తగా శ్మశాన వాటిక నిర్మించేందుకు అవకాశం కల్పించింది. ఆయా గ్రామ పంచాయతీలో ప్రభుత్వ స్థలం ఉంటే వెంటనే సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయి అవసరాలను గుర్తించి వాటిపై నివేదికను తయారుచేసి పంపించాలి. ప్రభుత్వం కొత్త చేపట్టిన అనుసంధాన పక్రియ విధానంపై కూలీలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు గ్రామీణ పేదరిక నిర్మూల సంస్థ ఐకేపి సౌజన్యంతో సభలు, సమావేశాలు, సదస్సులు నిర్వహించాల్సి ఉంది. చెరువుల పునరుద్ధరణకు తెలంగాణ, ఎపిలో కోట్లు ఖర్చు చేస్తున్నారు. నిజానికి ఉపాధిని దీనికి జోడించివుంటే మంచి జరిగేది.

జాతీయ రాజకీయాలపై కేసీఆర్ చూపు?

విపక్షాల ఐక్యతతో ముందుకు సాగేలా ప్లాన్

పొరచట్టంపై వ్యతిరేకతతో పావులు కదిపేందుకు వ్యూహం

రాజ్యసభకు వెళ్లడం ద్వారా హస్తినలో పాగాకు ప్రణాళిక

హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): మరికొద్ది రోజుల్లో సహకార ఎన్నికలు కూడా ముగిస్తే మరో నాలుగేళ్ల వరకు ఇక ఎన్నికల గోల అన్నది ఉండదు. ఇక ఈ నాలుగేళ్లు పాలన సజావుగా సాగించేలా టిఆర్ఎస్ అధినేత దృష్టి సారించాల్సి ఉంది. అయితే ఇటీవలి పరిణామాలు గమనిస్తే జాతీయ రాజకీయాలపై సిఎం కెసిఆర్ మక్కువగా ఉన్నారని తెలుస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు కూడా కెసిఆర్ జాతీయ రాజకీయాలపై ఆసక్తి ప్రదర్శించారు. నిజానికి విపక్షాలు అనుకున్నరీతిలో విజం సాధించి ఉంటే కెసిఆర్ ఢిల్లీలో మకాం వేసి ఉండేవారు. కానీ మళ్లీ బిజెపి అద్భుత విజయం సాధించడంతో సైలెంట్ అయ్యారు. అయితే ఇటీవల పొరచట్టం,ఎన్ఆరసిల నేపథ్యంలో ఓ వర్గం ఇప్పుడు బిజెపిని టార్గెట్ చేస్తోంది. దేశంలో విపక్షాలు మళ్లీ ఏకం అవుతున్నాయి. ఈ దశలో పొరచట్టాన్ని వ్యతిరేకిస్తూ సిఎం కెసిఆర్ కూడా ఘాటుగానే స్పందించారు. పొరచట్టానికి తాము వ్యతిరేకమన్నారు. అవసరమైతే జాతీయస్థాయిలో దీనికి వ్యతిరేకంగా తాను ముందుండి పోరాడుతానని ప్రకటించారు. ఈ మొత్తం వ్యవహారాలను గమనిస్తే ఇప్పటి నుంచే జాతీయ స్థాయిలో చక్రం తిప్పేలా కెసిఆర్ వ్యూహం పన్నుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర బాధ్యతలను కుమారుడు కెటిఆర్‌కు అప్పగించి జాతీయ రాజకీయాలకు వెళ్లాలనే ప్లాన్‌లో ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో త్వరలో ఖాళీకానున్న రాజ్యసభ స్థానంలో ఒకటి తనకు కేటాయించుకుని ఎంపిగా కెసిఆర్ వెళతారనే ప్రచారం తాజాగా రాజకీయవర్గాల్లో సాగుతోంది. రాజ్యసభకు వచ్చే మార్చిలో రెండుసీట్లు ఖాళీ కానున్నాయి. కె. కేశవరావు, గరికపాటి మోహన్‌రావుల సీట్లు ఖాళీ కానున్నాయి. కెకెకు మరోమారు ఎంపి ఛాన్స్ లేదనే అంటున్నారు. ఈ దశలో కెసిఆర్ రాజ్యసభ ద్వారా జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని చూస్తున్నట్లు సమాచారం. అలా అయితే గజ్వేల్ నుంచి కవితను శాసనసభకు ఎంపిక చేస్తారని తెలుస్తోంది. కెటిఆర్‌ను సిఎం చేసి, కవితను రాష్ట్ర మంత్రిగా చేసి, కెసిఆర్ కేవలం జాతీయ రాజకీయాలకే పరిమితం అవుతారని అంటున్నారు. ఒకవేళ అలా కాని పక్షంలో కవితను రాజ్యసభకు పంపే ఛాన్స్ కూడా ఉందంటున్నారు. మరోవైపు రాజ్యసభకు వెళ్లేందుకు ఇద్దరు మాజీ స్పీకర్లు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు టీఆర్ఎస్‌లో చేరిన మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి.. రాజ్యసభ సీటు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఈసారి తనకు తప్పకుండా చాన్స్ ఉంటుందన్న ధీమాలో ఉన్నారు. రాజ్యసభ చాన్స్ ఇవ్వకున్నా నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఇస్తారని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మాజీ స్పీకర్ మధుసూదనాచారి రాజ్యసభ సీటుపై కన్నేశారు. అలాగే ఎంతో కాలంగా ఢిల్లీలో అధికార ప్రతినిధిగా ఉన్న డాక్టర్ ఎన్ వేణుగోపాలచారి కూడా రాజ్యసభ కావాలని కోరుతున్నారు. గతంలో హామీ ఇచ్చారని ఆయన కూడా ఆశగా ఉన్నారు. అయితే రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ స్థానాలు ఎవరికి అన్నది కెసిఆర్ ఇష్టాఇష్టాలపైనే ఆధారపడి ఉంది. ఇతర పార్టీల్లో లాగా ఊహాగానాలకు ఇక్కడ తావులేదు. ఇకపోతే ఎమ్మెల్సీ సీట్ల కోసం కూడా టీఆర్ఎస్‌లో పోటీ పెరిగింది. ఇప్పటికే రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉండగా.. మార్చిలో రెండు రాజ్యసభ సీట్లు, జూన్‌లో మరో రెండు ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అవుతున్నాయి. దీంతో కొందరు ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టారని సమాచారం. అవకాశమున్న ప్రతిసారి కేసీఆర్, కేటీఆర్‌లను కలిసి మనసులోని మాట చెప్తున్నారు. గవర్నర్ కోటాలో ఒక ఎమ్మెల్సీ స్థానం, నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానం ఖాళీగా ఉన్నాయి. జూన్ చివరికి గవర్నర్ కోటాలోని ఎమ్మెల్సీలు నాయిని నర్సింహారెడ్డి, కర్నె ప్రభాకర్‌ల పదవీకాలం ముగుస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన మాజీ మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, చందూలాల్ ఎమ్మెల్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఉద్యమ కాలం నుంచి పార్టీలో ఉన్న నాయకులు వి.ప్రకాశ్, దేవీప్రసాద్,

కియా కలకలంపై నిగ్గు తేల్చాలా

అనుమానాల నివృత్తికి నడుం బిగించాలి

పరస్పర ఆరోపణలతో వాతావరణం చెడడం ఖాయం

అమరావతి,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): అనంతపురంలోని కియా మోటార్స్ ఉత్పత్తి ప్లాంటు తమిళనాడుకు తరలి పోతోందంటూ అంతర్జాతీయ మీడియా సంస్థ రాయటర్స్ ప్రచురించిన కథనం సంచలనం రేకెత్తించడంతో పాటు కలకలం రేపింది. నిజానికి ఇది రాయిటర్స్‌లోనే ఎందుకు వచ్చిందన్న వాదనా ఉంది. నిప్పులేనిదే పొగరాదన్నట్లుగా ఎక్కడో కొంత లీక్ జరిగిందనే భావించాలి. ప్రధానంగా కియా పరిశ్రమ కిచ్చిన రాయితీలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమీక్షిస్తోందని రాయిటర్స్ తాజా కథనంలో పేర్కొంది. స్థానికంగా బెదిరింపులు వస్తున్నాయంటూ ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకువెళ్లినా ఫలితం లేదని, పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలన్న నిబంధన కూడా కంపెనీకి ఇబ్బందిగా మారిందని, ఈ నేపథ్యం లోనే తమిళనాడు ప్రభుత్వంతో చర్చలు జరుపుతోందని తెలిపింది. దీంతో ఉలికిపడిన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ఆ వార్తలు పూర్తిగా అవాస్తవమని పరిశ్రమలు, వాణిజ్యం, పెట్టుబడుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ పేర్కొన్నారు. అయితే అన్యాపదేశంగా అయినా ఎంపి మిదున్ రెడ్డి కూడా కియాకు అప్పనంగా భూములు కట్టబెట్టారని అన్నారు. అంటే ఓ రకంగా రాయితీలను సమీక్షిస్తున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం ఉందనే గమనించాలి. ఎందుకంటే వేలకోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన ఓ సంస్థ ఇలాంటి బెదరింపులను తట్టుకుని నిలబడలేదు. రాయిటర్స్ లాంటి సంస్థ పనిగట్టుకుని ప్రభుత్వంపై బురద చల్లే విధంగా చవకబారుగా కథనం రాయదని గుర్తించాలి. ఎందుకంటే తెరవెనుక నుండి ఎవరో రాయించినందు వల్లే కథనం రాసినట్లు అధికార వైకాపా నేతలు ఆరోపిస్తున్నా అందులో నిజం లేదు. అలా ఎవరో చెబితే నిజానిజాలు బేరీజు వేసుకోకుండా కథనం రాదు. మొత్తంగా ఈ కథనం ఇటు రాష్ట్రంలోనూ, అటు లోక్‌సభలోనూ చర్చనీయాంశంగా మారింది. అనంతపురం జిల్లాలో ఏర్పాటైన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ కియా మోటార్స్ ఇటీవలే ఉత్పత్తి ప్రారంభించింది. దీనిని ఇక్కడ స్థాపించేలా నాటి సిఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేశారు. అయితే దీనిని కూడా రాజకీయం చేసి తమ ఖాతాలో వేసుకోవాలని వైకాపా నేతలు ప్రయత్నాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా ప్లాంటును తమిళనాడుకు తరలించేందుకు అక్కడి ప్రభుత్వంతో చర్చలు జరుపుతోందన్నది రాయిటర్స్ కథనం సారాంశం. అయితే ఇప్పుడు ఎదురుదాడి చేయడం కన్నా కియాకు బెదిరింపులు వచ్చా..వస్తే ఎవరు చేశారన్నది నిగ్గు తేల్చాల్సిన బాధ్యత వైకాపా ప్రభుత్వంపై ఉంది. దీనిని ఖండించి, తెలుగు దేశం పార్టీని నిందించడం వల్ల అంతర్జాతీయంగా వచ్చిన అపప్రథ తొలగిపోదు. తరలింపు కథనాన్ని వైకాపా ప్రభుత్వం ఎలాగూ తోసిపుచ్చింది. తమిళనాడు ప్రభుత్వం కూడా ఈ వార్తలపై స్పందించింది. అటువంటి సంప్రదింపు లేవి జరగలేవని పేర్కొంది. మరోవైపు అధికార,ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. తెలుగుదేశం పార్లమెంటు సభ్యులు లోక్‌సభలో దీనిని ప్రస్తావించగా, వైసిపి సభ్యులు తోసిపుచ్చారు.

రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎంపి రామ్మోహన్ నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 1.1 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏపిలో నెలకొల్పిన కార్ల తయారీ పరిశ్రమ కియా మోటార్స్ ఇప్పుడు ఏపి నుంచి తరలిపోతోందని పేర్కొన్నారు.

కియా మోటార్స్ విషయంలో చంద్రబాబు నాయుడు కృషి ఏమాత్రం లేదని ,ఆ సంస్థ అడిగిన అన్ని సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ఎంపి విజయసాయి రెడ్డి అన్నారు. అలాగే కియా సంస్థ మరింత విస్తరిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితులు నెలకొల్పాల్సిన ప్రభుత్వం ఉన్న పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ సంస్థలు రాష్ట్రాన్ని వీడి వెళ్లిపోయేలా చేస్తోందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. కియా కార్ల సంస్థ రాష్ట్రం నురచి తరలిపోతోరదంటూ తప్పుడు ప్రచారం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. మరోవైపు కియా మోటార్స్ రాష్ట్రం నుండి వెళ్ళిపోతున్నట్లు వచ్చిన వార్తలపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు డిమాండ్ చేశారు. ఇకపోతే కియా పరిశ్రమ రాష్ట్రం నుండి తరలిపోతుందంటూ ప్రముఖ మీడియా సంస్థ రాయిటర్స్ ప్రచురించిన కథనంపై సిపిఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తంగా ఇప్పుడు పరస్పర ఆరోపణలు ఎలా ఉన్నా కియా విషయంలో రాయిటర్స్ లేపిన దుమారంపై విచారణ జరగాలి. నిజాలు నిగ్గు తేల్చాలి. అప్పుడే రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు వాతావరణం ఉంటుంది. లేకుంటే అనుమానాలు మరింతగా బలపడుతాయి.

జంపన్న వాగుపై చెక్ డ్యాం ఏమైంది

-నిధులకు తగ్గట్లుగా సౌకర్యాలు లేవు : లక్ష్మణ్

మేడారం,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): మేడారం జాతరకు కుంభమేళా తరహాలో ఏర్పాట్లు చేస్తామన్న ముఖ్యమంత్రి కెసిఆర్ కనీస ఏర్పాట్లను కూడా కల్పించలేదని రాష్ట్ర బిజెపి చీఫ్ లక్ష్మణ్ అన్నారు. నిధులకు తగ్గట్లుగా ఏర్పాట్లు జరగేలదన్నారు. గురువారం ఉదయం ఆయన అమ్మవార్లను దర్శించుకోవడానికి మేడారంకు బయలుదేరారు. మీడియాతో మాట్లాడిన ఆయన ప్రకృతితో ముడిపడిన ఆదీవాసీల జాతర మేడారం జాతర అని అన్నారు. ప్రజలందరూ బాగుండాలని బంగారం మొక్కును అమ్మవార్లకు సమర్పిస్తున్నామని అన్నారు. ఇందులో కోట్లాదిమంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకుంటారని ఇలాంటి ఘనమైన జాతరకు ఏర్పాట్లు అంతంత మాత్రమే చేశారని తెలిపారు. జంపన్న వాగుపై చెక్ డ్యాం కడతామన్న కెసిఆర్ ఇప్పటికీ కట్టలేదని అన్నారు. గతంలో జాతరకు వెళ్లిన సీఎం కెసిఆర్ కుర్చీవేసుకుని కూర్చుని మరీ.. 200కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామన్నారని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా ప్రస్తుతం మేడారం జాతర నిధులను అధికారపార్టీ నేతలు మాయంచేశారని అన్నారు. నిధులను మింగడానికే నలుగురు కలెక్టర్లను మార్చారని చెప్పారు.

ఢిల్లీ బిజెపిలో సిఎం స్థాయి అభ్యర్థులు లేరు

-షహీన్ బాగ్ రోడ్డుపై రాజకీయం తగదు:కేజ్రీవాల్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): ఢిల్లీ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టే స్థాయి ఉన్న నాయకుడు బీజేపీలో ఎవ్వరూ లేరని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ దెప్పిపొడిచారు. బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్నది ఢిల్లీ ప్రజలు తెలుసుకోవాలని భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఓ జాతీయ ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. సీఎం అభ్యర్థి సంబిత్ పాత్రానా? లేదా? అనురాగ్ ఠాకూరా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా బీజేపీ ఓట్లను ఏకత్రీకరణ చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందని, ఆ ఎత్తుగడ ఎంత మేరకు ఫలిస్తుందో చూడాల్సిందేనని అన్నారు. షహీన్ బాగ్ రోడ్డును తిరిగి గాడిలో పెట్టడానికి కేంద్ర హోంమంత్రికి ఏం అడ్డమొచ్చిందని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలు ఉన్న కారణంగానే షహీన్ బాగ్ రోడ్డు వ్యవహారాన్ని రాజకీయం చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. షహీన్ బాగ్ రోడ్డును మూసేయాల్సిన పరిస్థితి అమిత్‌షాకు ఎందుకొచ్చిందని, చెత్త రాజకీయాలతో ఢిల్లీ ప్రజలను ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని కేంద్రంపై ఆయన నిప్పులు చెరిగారు. పట్టాలు లేని కాలనీల గురించి బీజేపీ పూర్తిగా మరిచిపోయిందని, పైగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రజలు వైద్యం, రోడ్లు, నాణ్యమైన విద్యుత్తును కోరుకుంటున్నారని, తిరిగి తాము అధికారంలోకి వస్తే కొత్త పథకాలను ప్రకటిస్తామని కేజీవ్రాల్ హామీ ఇచ్చారు.

పలువురు ఐపిఎస్‌లకు పదన్నోతులు

-ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పలువురు ఐపీఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఎస్పీలకు డీఐజీలుగా, డీఐజీలకు ఐజీలుగా పదోన్నతి లభించింది. డీఐజీ రాజేష్ కుమార్, శివకుమార్ రెడ్డి, రవీందర్‌కు ఐజీలుగా, డీఐజీలుగా ఉన్న కార్తికేయన్, రమేష్ నాయుడు, సత్యనారాయణ, సుమతి, శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు ఐజీలుగా ప్రమోట్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటూ వస్తోన్న ఐపీఎస్ బదిలీలపై ఎడతెగని ఉత్కంఠ కొనసాగిన విషయం తెలిసిందే. నేడు, రేపు అంటూ ఊరిస్తోన్న ట్రాన్స్‌ఫర్ల ప్రచారంతో పోలీసు అధికారులు ఆసక్తిగా ఎదురు చూశారు. ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి 50మంది ఐపీఎస్‌లోను ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తర్వాత రోజు ఐపీఎస్‌ల బదిలీలు ఉంటాయని భారీగా ప్రచారం సాగింది. కానీ, అలాంటిదేమీ జరగలేదు. వాస్తవానికి ఐపీఎస్‌ల బదిలీలు, పదోన్నతులు 2018లోనే జరగాల్సింది. కానీ, అసెంబ్లీకి జరిగిన ముందస్తు ఎన్నికల కారణంగా వాయిదా పడ్డాయి. దీంతో ఏప్రిల్‌లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. 2019 ఏప్రిల్‌లో రాష్ట్ర హోంశాఖ కేంద్రం అనుమతితో 23 మంది ఐపీఎస్‌లకు పదోన్నతులు కల్పించింది. వాస్తవానికి పదోన్నతితోపాటు బదిలీ తప్పనిసరి. కానీ, వీరికి పదోన్నతి దక్కినా.. పాత కుర్చీల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు 10 నెలలుగా తమకు కొత్త పోస్టింగ్‌లు వస్తాయని ఎదురు చూశారు.

ప్రాణహిత వంతెనతో తగ్గనున్న దూరం

నాలుగు రాష్ట్రాలకు పెరగనున్న రవాణా

త్వరగా పూర్తి కావస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

ఆదిలాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): తెలంగాణ- మహారాష్ట్రలను కలుపుతూ గూడెం ప్రాణహిత వద్ద రాష్ట్ర ప్రభుత్వం రూ.55 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో ఇక్కడి ప్రజల చిరకాల స్వప్నం త్వరలోనే నెరవేరనుంది. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో గూడెం ప్రాణహిత వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణంతో నాలుగు రాష్ట్రాలకు రవాణా మెరుగుపడనుంది. వంతెన నిర్మాణం పూర్తయితే వివిధ ప్రాంతాలకు వందల కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు సమయం ఆదా అయ్యే అవకాశాలు ఉన్నాయి. దశాబ్దాలుగా ప్రజలు పడే కష్టాలు తీరనున్నాయి. వంతెన నిర్మాణంతో నాలుగు రాష్ట్రాలతో వ్యాపార, వాణిజ్య సంబంధాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం నాటు పడవల ద్వారా ప్రయాణం చేస్తూ వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్నారు. నియోజక వర్గంలోని కౌటాల, బెజ్జూర్, రవీంద్రనగర్‌లో ప్రతి వారం నిర్వహించే వారం సంతలకు మహారాష్ట్ర వ్యాపారులు ఇక్కడికి వచ్చి క్రయ, విక్రయాలు జరుపుతున్నారు.

వంతెన పూర్తయితే రవాణా మెరుగుపడి వ్యాపార సంబంధాలు మరింత బలపడనున్నాయి. అలాగే తెలంగాణలోని ప్రజలకు మహారాష్ట్ర ప్రజలతో బంధుత్వాలున్నాయి. ఈ బంధుత్వాలు మరింత మెరుగుపడనున్నాయి. ప్రస్తుతం దూరాన్ని పరిగణనలోకి తీసుకుంటే తెలంగాణ నుంచి మహారాష్ట్రలోని అహేరి వెళ్లేందుకు 125 కిలోమీటర్లు ప్రయాణించాలి. కానీ ఈ వంతెన పూర్తయితే కేవలం 22 కి.మీ. దూరం మాత్రమే ఉంటుంది. చింతలమానేపల్లి నుంచి అహేరి, గడ్చిరోలి వెళ్లేందుకు 168 కి.మీ.ల దూరం ఉండగా ఈ వంతెన మీదుగా కేవలం 50 కి.మీల దూరం ప్రయాణం చేస్తే సరిపోతుంది. అదేవిధంగా ఛత్తీస్‌గఢ్ వెళ్లేందుకు మహారాష్ట్ర మీదుగా 250 కి.మీ లపైనే దూరం పడుతుండగా, గూడెం వంతెన మీదుగా 130 కి.మీ.లు మాత్రమే ప్రయాణించాల్సి ఉంటుంది. మధ్యప్రదేశ్ వెళ్లేందుకు మహారాష్ట్ర మీదుగా 340 కి.మీ.లు ఉండగా వంతెన ద్వారా అహేరి నుంచి కేవలం 215 కి.మీ. ప్రయాణం మాత్రమే. చింతలమానేపల్లి నుంచి గోదావరిఖని మీదుగా కాళేశ్వరం వెళ్లేందుకు 245 కి.మీ.లు ప్రయాణించాల్సి ఉండగా, ఈ వంతెన మీదుగా అహేరి, సిరికొండ మీదుగా 140 కి.మీ.ల దూరం మాత్రమే ఉంటుంది. 2017 ఫిబ్రవరి 6న అప్పటి రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వంతెన పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈక్రమంలో శరవేగంగా వంతెన నిర్మాణ పనులు జరిగాయి. సంవత్సరం నుంచి రాష్ట్రంలో వరుస ఎన్నికలతో కోడ్ కారణంగా దీంతో కొంత కాలం పనులు ఆగినా, ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. మొత్తం 26 పిల్లర్లతో వంతెన నిర్మాణ పనులను మొదలు పెట్టి పూర్తి చేశారు. పిల్లర్లపై గడ్డర్లను వేసి స్లాబ్ పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే వంతెనపై రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఎలాగైనా వంతెనపై రాకపోకలు సాగేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. దీంతో నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని, వ్యాపార, వాణిజ్య పరంగా ఇబ్బందులు తొలగనున్నాయని ఇక్కడి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కంది రైతులకు కుచ్చు టోపీ

ఏటేటా మోసాలకు గురవుతున్నా పట్టించుకోని వైనం

ప్రైవేట్ వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు

హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): కంది రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎఫ్‌సీఐని రంగంలోకి దింపి మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోళ్లను చేపట్టి, మద్దతుధర నిర్ణయించింది. అయితే వ్యాపారులతో చేతులు కలపడంతో అన్నదాత మోసానికి గురవుతున్నాడు. రైతులకు వ్యాపారులకు మధ్య సమన్వయకర్తలుగా ఉండాల్సిన అధికారులే వ్యాపారులతో కలిసిపోయారు. దీంతో రైతులకు కనీన మద్దతు దొరకడంలేదు. తేమ ఉందనే సాకుతో రైతుల నుంచి సరకు కొనుగోలు చేయకుండా మార్క్‌ఫెడ్ అధికారులు తిరస్కరిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యాపారులు అడిగిన ధరకు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రైతులు మార్కెట్‌కు తీసుకుని వచ్చే సరకులో తేమ ఉందని కందులను కొనుగోలు చేయడానికి మార్క్‌ఫెడ్ అధికారులు తిరస్కరించడం, వాటిని తక్కువ ధరలకు ప్రైవేటు వ్యాపారికి విక్రయించడం షరా మామూలు అయ్యింది. చాలా సందర్భాల్లో నాణ్యత లేదనే సాకుగా చూపించి మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేయకుండా వదిలేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులతో కలిసిపోయిన అధికారులు వ్యాపారుల వైపే మొగ్గుచూపు తున్నారు.

నాణ్యత లేదనే సాకుతో రైతులు తీసుకొచ్చిన కందులను కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారు. 12శాతం వరకు తేమ ఉన్న కందులను ప్రభుత్వ రంగ సంస్థనే కొనవచ్చు. కానీ.. తేమ అంతకు మించి ఉందని కొనకుండా రైతులు ప్రైవేటు వ్యాపారులవైపు వెళ్లేలా చేస్తున్నారు. అధికారులు సైతం దళారులుగా మారిపోయారు. ప్రైవేటు వ్యాపారులకే అన్నీ అప్పగించేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో కాంటా నుంచి ధర నిర్ణయించడం వంటివి కూడా ప్రైవేటు వ్యక్తులే చేస్తున్నారు. చిన్నసన్నకారు రైతులు తీసుకొచ్చిన కందులను మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేయడంలేదు. తేమ ఎక్కువగా ఉందని తిరస్కరించిన కందులను ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇవే కందులను గుట్టుచప్పుడు కాకుండా మార్క్‌ఫెడ్ అధికారులకు విక్రయిస్తున్నారు. అందుకు తగిన ఏర్పాట్లన్నీ రాత్రివేళల్లో జరుగుతున్నట్లు తెలిసింది. ఇలా చేసిన కొనుగోళ్లకు సంబంధించిన ఆధారాలన్నీ సమకూర్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మార్కెట్‌లో విక్రయించిన సరకులకు తప్పనిసరిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో తక్‌పట్టీ ఇవ్వాలి. అసలైన తక్‌పట్టీ రైతుకు ఇచ్చి మిగిలిన రెండు నకలును ఒకటి వ్యాపారి, మరొకటి మార్కెట్ అధికారుల వద్ద ఉంచుతారు. దీని వల్ల మార్కెట్‌కు రావాల్సిన పన్ను సమకూరడమేకాకుండా.. అక్రమాలకు అవకాశం ఉండదు. కానీ..ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసిన సరకుకు తక్‌పట్టీలను ఇవ్వడంలేదు. వ్యాపారులే తెల్లకాగితంపైన రాసిస్తున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల రైతులతోపాటు ప్రభుత్వం నష్టపోవాల్సిన పరిస్థితులున్నాయి. రైతులను తూకంలో కూడా మోసం చేస్తున్నారు. ఎరువుల ఖాళీ సంచుల్లో తీసుకొచ్చిన కందులకు కూడా కిలో తరుగు తీస్తున్నారు. ఇక్కడ హమాలీ దందా కూడా ఎక్కువే ఉంది. ప్రతి రైతు వద్ద క్వింటాల్‌కు రెండు కిలోల చొప్పున తీసుకుంటున్నారు. వీటిపైన రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారుల దగ్గర రైతుల పేరుతో కందులు కొనుగోలు చేయడంతో భారీగా అక్రమాలు జరిగాయి.

సమస్యలపై ఎన్నాళ్లీ రాజకీయాలు

తెలంగాణ విభజనపై పదేపదే విమర్శల్లో ఆంతర్యం

ప్రధాని ప్రకటనలతో గందరగోళం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): తెలంగాణ విభజన సమస్యపై ప్రధాని మోడీ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను విమర్శించడానికా లేక ఆంధ్రప్రదేశ్‌పై ప్రేమ చూపడానికా అన్నది అర్థంకావడం లేదు. తాజాగా మరోమారు ప్రధాని మోడీ లోక్‌సభలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణ బిల్లును పెట్టినప్పుడు పార్లమెంట్ తలుపులు మూసేసారని, ఎపి ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వలేదని అన్నారు. ఇదే విషయాన్న గతంలోనూ పలుమార్లు ప్రస్తావించారు. విభజన తరవాత అనేక సమస్యలు ఉన్నా ప్రధానిగా మోడీ ఏ ఒక్క సమస్యను పెద్దగా పట్టించుకోవడం లేదు. అంతేనా అంటే అసలు ఖాతరు చేయడం లేదు. ఇకపోతే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో ఆయన రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. నీతి ఆయోగ్ కేంద్రరాష్ట్రాల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలోనూ, ఆ తరవాత అనేకానేక హామీలు గుప్పించారు. తాను ఇతర నాయకుల కన్నా డిఫరెంట్ అన్నారు. అయితే ఆయన ఎంతటి డిఫరెంట్ అన్నది ఇప్పుడు చేతల్లో చూపిస్తున్నారు. విభజన సమస్యల విషయంలో నిర్లక్ష్యం కారణంగా ప్రజల్లో అసహనం పెరుగుతున్నా రాజకీయ వ్యవహారాలకిచ్చిన ప్రాధాన్యం రాష్ట్రాలకు ఇవ్వడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు సాయం అందించే విషయంలోనూ పెద్దగా స్పందించడం లేదు. ఇకపోతే నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుచేయాలన్న డిమాండ్‌ను పక్కన పెట్టి, ఉన్న స్పైసెస్ బోర్డు బ్రాంచ్ ఆఫీస్‌ను నిజామాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు.

ఇదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా వ్యవహారంలో మారోమారు నో చెప్పారు. ఎపికి సాయంపై విపక్షాలు పదేపదే ప్రశ్నస్తున్న సమయంలోనూ పట్టించుకోలేదు. ఏపి ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని, సమస్యల పరిష్కారానికి చర్చల ద్వారా ఒక మార్గం కనుగొంటామని ప్రధాని మోడీ గతంలో ప్రకటించినా ఎలాంటి ప్రయోజనం ఒనగూరలేదు. కేంద్రానికి అన్ని విషయాల్లో సహకరిస్తున్నా ఏపి విషయంలో మాత్రం వివక్ష కొనసాగుతోంది. రాజధాని శంకుస్థాపన సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నీ పక్కకు పోయాయి. కేంద్ర బడ్జెట్ లో ప్రత్యేక ప్యాకేజీ కానీ..రాజధాని..రైల్వే జోన్ వంటి అంశాలకు ఏ మాత్రం కేటాయింపులు చేయకపోవటంపై విమర్శలు ఉన్నాయి. విభజన సమస్యలు గురించి మాట్లాడితే ప్రయోజనం ఏంటన్నది పక్కన పెడితే బిజెపి కూడా పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. హోదా బదులు ప్యాకేజీకి అంగీకరించారు. హోదా కంటే ప్యాకేజీలోనే ఎక్కువ వస్తాయని చెప్పారు. కానీ ప్యాకేజీలో ఏమీ రాలేదు. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లన్న రీతిలో ఉన్న మోడీ వ్యవహార శైలి కారణంగా ప్రజలు నష్టపోతున్నారు. అనేకానేక నిర్ణయాలు తీసుకుంటున్న తరుణంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు మేలు చేసే సందర్భంగాచొరవ చూపడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాలను కలుపుకుని పరీక్షలను విజయవంతం చేయాలన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. అనంతరం పరీక్షల సమయంలో విద్యుత్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలు పోలీస్ స్టేషన్ నుంచి తీసుకురావాలన్నారు. కలెక్టర్లు జిల్లా స్థాయి కమిటీ చైర్మన్లుగా బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, పారదర్శక రీతిలో సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఇక విద్యార్థుల ఇంటర్ పరీక్షల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు పరీక్షలపై శ్రద్ధ వహించాలన్నారు.



ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి.

యోగి ప్రచారంపై నిషేధం విధించాలి

వివాదస్పద వ్యాఖ్యలపై మండిపాటు

ఇసికి ఫిర్యాదు చేసిన ఆప్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో యోగీ ఆదిత్యనాథ్ వివాదాస్పద వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఢిల్లీలోని అధికారిక ఆప్ పార్టీ యోగీ ఆదిత్యనాథ్‌ను ప్రచారం నుంచి నిషేధం విధించాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘంకు ఫిర్యాదు చేసింది. మతపరమైన వ్యాఖ్యలు చేస్తూ రెండ వర్గాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం యోగీ చేస్తున్నారని ఈసీకి ఫిర్యాదు చేసింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ వివాదాలకు కేంద్రంగా నిలిచారు. తాజాగా ఓ విదేశీ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో యోగీ ఆదిత్యనాథ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టంకు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో యోగీ ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు మళ్లీ అగ్గిరాజేసేలా కనిపిస్తున్నాయి. దేశ విభజన సమయంలో ముస్లింలు పాకిస్తాన్‌కు వెళ్లకుండా ఇక్కడే ఉండటం వల్ల దేశానికి ఎలాంటి మేలు జరగలేదన్నారు. దేశ విభజనను ముస్లిం సామాజిక వర్గం వారు వ్యతిరేకించి ఉండి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో పౌరసత్వ సవరణ చట్టంకు వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో యోగీ వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోసినట్లయ్యాయి. ఇప్పటికే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు యోగీ ఆదిత్యానాథ్. అంతకుముందు ఓ సభలో మాట్లాడిన యోగీ ఆదిత్యనాథ్ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ ఉగ్రవాది అని పేర్కొన్నారు. అంతేకాదు షాహీన్‌బాగ్‌లో జరుగుతున్న నిరసనల వెనక ఉంది ఆమ్ ఆద్మీ పార్టీ అని ఆరోపణలు చేశారు. ఇక మరో సందర్భంలో భారత పౌరసత్వ సవరణ చట్టంకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న వారంతా పాకిస్తాన్‌కు మద్దతు పలుకుతున్నట్లే లెక్

లోక్‌సభలో గందరగోళం

కాంగ్రెస్,బిజెపిల మధ్య వాగ్వాదం
రాహుల్ వ్యాఖ్యలపై క్షమాపణలకు బిజెపి డిమాండ్
మంత్రి హర్షవర్ధన్‌పై దూసుకెళ్లిన కాంగ్రెస్ ఎంపీలు
గందరగోళం మధ్య లోక్‌సభను వాయిదా వేసిన స్పీకర్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): లోక్‌సభలో మరోమారు శుక్రవారం గందరగోళం నెలకొన్నది. కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోదీపై చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి హర్షవర్ధన్ లేవనెత్తడంతో రగడ మొదలైంది. ప్రధానిపై చేసిన వ్యాఖ్యలకు రాహుల్ వివరణ ఇవ్వాలనీ.. భేషరతుగా క్షమాపణ చెప్పాలని హర్షవర్ధన్ డిమాండ్ చేశారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆగ్రహంతో ఆయన వద్దకు దూసుకు వెళ్లి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓ సభ్యుడు కేంద్రమంత్రి చెయ్యి పట్టుకోవడంతో.... ఆయనపై చేయి చేసుకుంటారా అంటూ అధికార పక్షం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీలను అడ్డుకునేందుకు బీజేపీ ఎంపీలు కూడా రావడంలో లోక్‌సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో సభను మధ్యాహ్నం 1 గంట వరకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. కాగా ఆరు నెలల్లోగా ఉద్యోగాలు ఇవ్వకపోతే యువకులంతా ప్రధాని నరేంద్ర మోదీని కర్రలతో కొడతారంటూ ఇటీవల రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీనిపై ఇప్పటికే లోక్‌సభ వేదికగా ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు విసరగా.. ఇవాళ బీజేపీ సభ్యులు సైతం రాహుల్ వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్ ఎంపీలంతా.. కేంద్ర మంత్రి హర్షవర్ధన్ మీదకు దూసుకువెళ్లారు. ప్రధాని మోదీ పట్ల రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, దానికి ఆయన క్షమాపణలు చెప్పాలని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సభలో ప్రతిష్టంభన నెలకొన్నది. ఆవేశం మీదున్న కాంగ్రెస్ ఎంపీలంతా.. కేంద్ర మంత్రి వైపుగా దూసుకువెళ్లారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఈ ఘటన జరిగింది. ప్రధాని మోదీని చితకబా దేందుకు యువత సిద్ధంగా ఉన్నట్లు రాహుల్ ఓ కామెంట్ చేశారు. అయితే ఆ కామెంట్ పట్ల క్షమాపణలు చెప్పాలని మంత్రి హర్షవర్ధన్ కోరారు. కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకురావడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ కార్యక్రమాలకు అడ్డుపడిన రాహుల్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేయాలని అధికారపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దీంతో గందరగోళం చెలరేగడంతో సభను వాయిదా వేశారు.

గుండాల్లా వ్యవహరించిన కాంగ్రెస్ నేతలు

లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీల తీరుపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రోద్బలంతోనే కాంగ్రెస్ నేతలు గూండాల్లా ప్రవర్తిస్తున్నారంటూ ఆయన దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ ప్రోద్బలంతోనే వాళ్లంతా ఇలా 'కొట్టడానికి' మీదికెళ్తున్నారు. డాక్టర్ హర్షవర్ధన్‌పై దాడి చేయడానికి సైతం ప్రయత్నించారు. కాంగ్రెస్ ఎంత నిరాశలో కూరుకుపోయిందో, వాళ్లు ఎంత గూండాయిజం ప్రదర్శిస్తున్నారో దీన్నిబట్టే అర్థమవుతోందని పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి హర్షవర్ధన్ లోక్‌సభలో ప్రస్తావించడంతో కాంగ్రెస్, బీజేపీ ఎంపీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చి, క్షమాపణ చెప్పాలంటూ హర్షవర్ధన్ డిమాండ్ చేయడంతో కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి నిల్చున్న స్థానం వద్దకు దూసుకెళ్లి నిరసన తెలిపారు. సందర్భంగా ఓ ఎంపీ మంత్రి చెయ్యిపట్టుకునేందుకు ప్రయత్నించడంతో మరింత ఉద్రిక్తత నెలకొంది. కాగా కాంగ్రెస్ నేతల తీరుపై తాము స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ ఎంపీలు పేర్కొన్నారు.

కాంగ్రెస్ తీరు అభ్యంతరకరం

లోక్‌సభలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ వాతావరణంపై బీజేపీ సీనియర్ ఎంపీ జగదాంబికా పాల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి మాట్లాడుతుండగా.. ప్రతిపక్ష సభ్యులు ఆయన వద్దకు దూసుకెళ్లడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి హర్షవర్ధన్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో లోక్‌సభలో రగడ మొదలైంది. రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చి, క్షమాపణ చెప్పాలంటూ హర్షవర్ధన్ డిమాండ్ చేయడంతో కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి నిల్చున్న స్థానం వద్దకు దూసుకెళ్లి నిరసన తెలిపారు. సందర్భంగా ఓ ఎంపీ మంత్రి చెయ్యిపట్టుకునేందుకు ప్రయత్నించడంతో మరింత ఉద్రిక్తత నెలకొంది. దీంతో స్పీకర్ గంట పాటు సభను వాయిదా వేశారు. అనంతరం ఎంపీ జగదాంబికా పాల్ మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి హర్షవర్ధన్ మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ ఆయన మీదికి దూసుకెళ్లారు. ప్రజాస్వామ్యంలో ఈ సంఘటన చాలా దురదృష్టకరం.అని పేర్కొన్నారు. కాగా కాంగ్రెస్ నేతలు మంత్రి మీదికి దూసుకెళ్లడంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

నర్సరీల్లో వేగంగా మొక్కల పెంపకం

ఆదిలాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం పనులను వేగవంతం చేయాలని డీఆర్డీవో రాజేశ్వర్ రాథోడ్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం మొదట్లో మొక్కలు నాటేలా పనులు వేగవంతం చేయాలన్నారు. నర్సరీలో డిమాండ్ ప్రకారం మొక్కలు పెంచాలని సూచించారు. మొక్కల సంరక్షణ బాధ్యతను కూడా పంచాయతీ అధికారులు చూడాలన్నారు. ఇప్పటి నుంచే మొక్కలను నర్సరీలో పెంచడంతో జూన్ నాటికి అవి బాగా పెరగడంతో పాటు నాటుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. నర్సరీ నిర్వాహకులు జూన్ నాటికి మొక్కలు చేతికి వచ్చేలా చూడాలన్నారు. మొక్కల పెంపకంపై అశ్రద్ధ వహిస్తే సంబంధిత సిబ్బంది, అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో దారుణ ఘటన

8ఏళ్ల చిన్నారిపై వ్యక్తి అత్యాచారం

జగిత్యాల,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): జిల్లాలో దారుణం జరిగింది. ఎనిమిదేళ్ల చిన్నారిపై మామ వరసయ్యే ఓ వ్యక్తి అత్యాచారం చేశాడు. చిన్నారి బంధువులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు . మేడిపల్లి మండలం వసునూరు గ్రామంలో గురువారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న ఇద్దరు చిన్నారుల్లో 8 ఏళ్ల ఓ చిన్నారిని గంగారెడ్డి అనే సఫాయి తీసుకెళ్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో అత్యాచారం చేశాడు. ఆ చిన్నారికి అతడు మామ వరస అవుతాడు. ఘటన జరిగిన తర్వాత ఈ విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడు గంగారెడ్డిని అదుపులోకి తీసుకుని అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వైద్య పరీక్షల కోసం చిన్నారిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎప్రిల్‌లో అయోధ్యలో ఆలయ నిర్మాణం

శ్రీరామనవమిని ముహూర్తంగా ప్రకటించే అవకాశం

లక్నో,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): అయోధ్యలో రామాలయాన్ని నిర్మించేందుకు త్వరలో ఆలయ ట్రస్టు ప్రకటనతో ఇక నిర్మాణ పనులు మొదలుపెట్టబోతోంది. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్రం ట్రస్ట్ ఏప్రిల్ నుంచి పనులు మొదలుపెట్టే ఆలోచనలో ఉంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం ట్రస్ట్ ని కూడా ఏర్పాటు చేయటంతో త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభం కాబోతున్నాయి. సీనియర్ అడ్వకేట్ పరాశరన్ చైర్మన్ గా పదిహేనుమంది సభ్యులతో కేంద్ర హోంశాఖ ట్రస్ట్ ను నోట్గి÷ చేసింది. ప్రయాగ్ రాజ్ లో ట్రస్టు తొలి సమావేశం జరుగుతుంది. అయోధ్యలో ఆలయ నిర్మాణాన్ని ఎప్పుడు ప్రారంభించాలన్నది తొలి సమావేశంలో నిర్ణయిస్తారు. ఏప్రిల్ రెండున శ్రీరామ నవమి, ఏప్రిల్ ఇరవై ఆరున అక్షయ తృతీయ ఈ రెండింటిలో ఏదో ఒక రోజు ఆలయ పనులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. విరాళాల సేకరణ, ఆలయ నమూనా, భక్తుల సౌకర్యాల వంటి వాటిపై ట్రస్ట్ కీలక నిర్ణయాలు తీసుకోవాల్సింది. ఏప్రిల్ రెండున శ్రీరామనవమి కావడంతో అదే రోజు పనులు ప్రారంభం కావచ్చు. అయోధ్యలో ఆలయ నిర్మాణానికి సంబంధించిన కసరత్తు వేగవంతం అయ్యింది. ఆలయ నిర్మాణం కోసం నగదు, ఆస్తుల రూపంలో ఎవరు విరాళాలిచ్చినా షరతుల్లేకుండా స్వీకరిస్తామని ట్రస్టు ప్రకటించింది. అయోధ్యలో ఆలయ నిర్మాణం, నిర్వహణ కోసం ఏదైనా సంస్థ నుంచి రుణాలు తీసుకునే అధికారాన్ని కూడా ట్రస్టుకే కట్టబెట్టింది ప్రభుత్వం. ట్రస్ట్ బాధ్యతలు ఎలా ఉండాలనే అంశానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తొమ్మిది నిబంధనలను రూపొందించింది. ట్రస్ట్ శాశ్వత కార్యాలయం ఏర్పాటు విరాళాల సేకరణ ఆలయ నిర్మాణంపై తుది నిర్ణయం తీసుకోవటం ఇలాంటి ప్రతి అంశానికీ ట్రస్టుదే బాధ్యతని స్పష్టం చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ లో ఆలయ నిర్మాణాన్ని చేపట్టి రెండేళ్ళల్లో దాన్ని పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రచిస్తున్నారు.

కాశ్మీర్‌లో ప్రాథమిక హక్కులు కోల్పోతున్నాం

అమ్మతో మాట్లాడడానికి చపాతీల్లో లేఖలు పెట్టా
మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ

శ్రీనగర్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): కశ్మీర్‌లోని ప్రజలు తమ ప్రాథమిక హక్కులు కోల్పోతున్నారని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ ఆవేదన వ్యక్తం చేశారు. మానసికంగా, ఆర్థికంగా ఎన్నో కష్టాలను వాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఫ్తీపై కఠినమైన ప్రజాభద్రత చట్టం కింద కేసు నమోదు చేయడానికి కొన్ని గంటల ముందు ఇల్తిజా ట్విటర్‌లో ఓ లేఖను పోస్టు చేశారు. 'నా తల్లిని అరెస్టు చేసి తీసుకెళ్లిన రోజును నేను ఎప్పటికీ మరువలేను. నేను తీవ్ర ఆందోళనకు లోనయ్యాను.నిర్బంధంలో ఉన్న తన తల్లికి చపాతీలో లేఖలు పెట్టి పంపించినట్లు ఇల్తిజా ముఫ్తీ తెలిపారు. గత ఆరు నెలలుగా మాజీ ముఖ్యమంత్రులు ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా గృహ నిర్బంధంలో ఉన్న విషయం తెలిసిందే. దీంతో తన తల్లితో మాట్లాడేందుకు వీలు లేకపోవడంతో చపాతీలో లేఖలు పెట్టి పంపించానని.. వాటి ద్వారానే తాము మాట్లాడుకున్నామని ఇల్తిజా తెలిపారు. కానీ ఒక రోజు మా అమ్మకు ఇంటి నుంచి పంపించిన టిఫిన్ బాక్స్‌లో ఓ లేఖ కనిపించింది. మా అమ్మ నాకు ఉత్తరం రాసి అందులో పెట్టి పంపించింది. నేను మాట్లాడేందుకు సామాజిక మాధ్యమాలను ఉపయోగించలేను. లవ్ యూ, మిస్ యూ అని అందులో రాసి ఉంది. ఆ తర్వాత దానికి ఎలా జవాబు పంపించాలో నాకు అర్థం కాలేదు. అందుకు మా బామ్మ ఓ ఐడియా ఇచ్చింది. ఓ చిన్న పేపరులో రాసి దాన్ని జాగ్రత్తగా చపాతీ రోల్‌లో మడిచి పెట్టి పంపించాను' అని ఆమె తెలిపారు. ప్రస్తుతం ముఫ్తీ శ్రీనగర్‌లోని ప్రభుత్వ బంగ్లాలో నిర్బంధంలో ఉన్నారు. గతేడాది ఆగస్టు 5న జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేసినప్పటి నుంచి ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాతో పాటు అనేక మంది నేతలను గృహ నిర్బంధం చేశారు. తొలుత ఆమెను ఛష్మషాహి గెస్ట్ హౌస్‌కు తీసుకెళ్లగా డిసెంబరులో అక్కడి నుంచి శ్రీనగర్ ప్రభుత్వ బంగ్లాకు తరలించారు.

తెలంగాణలో ఎవ్వరికీ కరోనా నిర్ధారణ కాలేదు

అనవసర ఆందోళనలు తగవన్న మంత్రి ఈటల రాజేందర్
వూహాన్ నుంచి తిరిగి వచ్చిన వారికి కూడా కరోనా నిల్

హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): ఇప్పటివరకు రాష్ట్రంలో పరీక్షలు చేసిన వారెవరికీ కరోనా వైరస్ నిర్ధారణ కాలేదని తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. కరోనా వైరస్‌పై పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనవసర ఆందోళనలు కలిగించవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కూడా భయాలకు గురి కావద్దన్నారు.

కరోనా లక్షణాలతో ఆస్పత్రిలో చేరినవారికి వైద్యపరీక్షలు నిర్వహించడం ఆలస్యమవుతండటంతో.. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలోనే వైద్యపరీక్షలు నిర్వహించేందుకు కేంద్రప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో సోమవారం నుంచి ఇక్కడే వైద్యులు కరోనా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. రోజుకు 30 మందికి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన టెస్ట్ కిట్లు కేంద్రం నుంచి వచ్చాయని తెలిపారు. ఈ పరీక్షల ద్వారా గంటలోపుగానే కరోనా వైరస్ సోకిందో లేదో తెలుసుకొనే అవకాశం ఉందని చెప్పారు.

ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎవరికీ కరోనా వైరస్ సోకలేదని కానీ విదేశాల నుంచి ముఖ్యంగా చైనా నుంచి రాష్ట్రానికి వస్తున్నవారిలో ఎవరికైనా కరోనా వ్యాధి లక్షణాలున్నట్లు అనుమానం కలిగితే, ఇతరులెవరికీ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని నగరంలో గాంధీ ఆసుపత్రి, ఫీవర్ ఆసుపత్రి, చెస్ట్ ఆసుపత్రులలో వైద్యపరీక్షలు చేయించుకోవాలాని మంత్రి ఈటల రాజేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరోనా వైరస్ వ్యాపించకుండా అన్ని ఆసుపత్రులలో , మాస్కులు, శానిటైజర్లు అందుబాటులో ఉంచామని, అలాగే వైద్య పరీక్షలు, సేవలు అందించేందుకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలో అన్ని జిల్లాలలో వైద్యఆరోగ్యశాఖ అధికారులు నిరంతరం అన్ని ఆసుపత్రులలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. కనుక ప్రజలు కరోనా వైరస్ గురించి వచ్చే పుకార్లను నమ్మవద్దని మంత్రి ఈటల రాజేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే కరోనా వైరస్ దెబ్బకు కుదేలవుతున్న వుహాన్ నుంచి స్వదేశానికి చేరుకున్న భారతీయులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. రెండు ప్రత్యేక విమానల్లో భారత్‌కు తీసుకొచ్చిన 645 మందిలో ఏ ఒక్కరికీ వైరస్ సోకలేదని పరీక్షల్లో తేలినట్లు వెల్లడించింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే, వారి నమూనాలను మరోసారి పరీక్షిస్తామని.. 14 రోజులు గడిచాక కూడా జాడ కనిపించకపోతేనే వైరస్ సోకలేదని పూర్తిస్థాయిలో నిర్ధారణ అవుతుందని తెలిపింది.

మరో కీలక ఉగ్రవాదిని హతమార్చాం

అల్-ఖైదా వ్యవస్థాపకుడు ఖాసిమ్ అల్-రిమిని హతం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): మరో కీలక ఉగ్రవాదిని హతమార్చినట్లు అగ్రరాజ్యం అమెరికా ప్రకటించింది. అరేబియా ద్వీపకల్పంలో అల్-ఖైదా వ్యవస్థాపకుడు ఖాసిమ్ అల్-రిమిని హతమార్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే ఖాసిమ్‌ను ఎప్పుడు చంపామనేది చెప్పలేదు. యెమెన్‌లో ఉగ్రవాదులపై జరిపిన కాల్పుల్లో ఖాసిమ్ అల్ రిమి మృతి చెందాడని తెలిపింది. ఖాసిమ్ మృతి అల్ ఖైదా కార్యాకలాపాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఫ్లోరిడాలోని యుఎస్ నావల్ ఎయిర్ స్టేషన్ పెన్సకోలాలో డిసెంబర్ 6 న జరిగిన కాలుపులు జరిగాయి. ఇందులో సౌదీ సైనికాధికారి ముగ్గురు అమెరికన్ నావికులు చనిపోయారు. అయితే ఆ కాల్పులకు తామే భాధ్యులమని అల్‌ఖైదా ఆదివారం ప్రకటించింది. దీనికి ప్రతికారంగానే అధ్యక్షుడు ఖాసిమ్ అల్-రిమిని అమెరికా హతమార్చింది.

బాలకృష్ణ చిన్నల్లుడికి బ్యాంక్ షాక్

రుణాల చెల్లింపుపై నోటీసులు

హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): టీడీపీ నేత, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చిన్నల్లుడు శ్రీ భరత్‌కు కరూర్ వైశ్యా బ్యాంకు షాక్ ఇచ్చింది. గీతం సంస్థల అధినేత శ్రీ భరత్ ఆస్తుల జప్తునకు ఏకంగా సిద్ధం అయ్యింది .బ్యాంకు నుండి తీసుకున్న రుణాలు చెల్లించని కారణంగా భరత్ తండ్రి పట్టాభి రామారావు, చిన్నాన్న లక్షణరావు, ఇతర కుటుంబ సభ్యులకు కరూర్ వైశ్యా బ్యాంక్ నోటీసులు జారీ చేసింది. ఈ విషయంపై శ్రీ భరత్ స్పందించకపోవడంతో.. ఏకంగా ఆస్తుల జప్తునకు బ్యాంక్ సిద్ధమైంది. భూములను తాకట్టు పెట్టి.. దాదాపు రూ. 124 కోట్ల రుణాలు తీసుకున్న శ్రీ భరత్ కుటుంబం గతంలో ఆంధ్రాబ్యాంక్ విషయంలో కూడా శ్రీ భరత్‌పై ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. బ్యాంకులో తీసుకున్న రుణాలు చెల్లించటం లేదని వచ్చిన ఆరోపణలకు అప్పుడు శ్రీ భరత్ స్పందించారు. తమ సంస్థకు ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు రానందున బ్యాంకు రుణాలు చెల్లించటం కష్టంగా మారిందని పేర్కొన్నారు. ఇక తాజాగా టెక్నో యూనిట్ ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరిట శ్రీ భరత్ కుటుంబం వైజాగ్‌లోని గాజువాక, భీమిలీలోని భూములను తాకట్టు పెట్టి.. దాదాపు రూ.124 కోట్లకు పైగా డబ్బును అప్పుగా తీసుకున్నారు.

కానీ అప్పు చెల్లించటంలో మాత్రం విఫలం అయ్యారు. అప్పటి నుంచీ ఇప్పటివరకూ వడ్డీ కూడా కట్టకపోవడంతో.. బ్యాంకు నోటీసులు జారీ చేసింది. తీసుకున్న అసలు వడ్డీతో కూడా కలిపి చెల్లించాలని నోటీసులో తెలిపింది బ్యాంకు. దాదాపు రూ. 124,39, 21 వేలు తిరిగి చెల్లించాలని లేని పక్షంలో తాకట్టుపెట్టిన ఆస్తులను జప్తు చేస్తామని బ్యాంకు నోటీసులో పేర్కొంది.

నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

పోలింగ్ కు సర్వం సిద్ధం
భారీగాఏర్పాట్లుచేసిన ఎన్నికల సంఘం
ఓటుహక్కు వినినయోగించుకోనున్న కోటి 47 లక్షల మంది ఓటర్లు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): దేశరాజధాని హస్తినలో అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమయ్యింది..! ప్రచార హోరు ముగియడంతో పోలింగ్ ఏర్పాట్లపై ఎన్నికల సంఘం దృష్టిపెట్టింది. శనివారం ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభమవుతుంది...! ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనేందుకు వీలుగా అనేక సంస్థలు ఆఫర్‌లు ప్రకటిస్తున్నాయి. వచ్చే ఐదేళ్ల పాటు దేశ రాజధానిని పాలించేది ఎవరో నిర్ణయించేందుకు ఢిల్లీ ఓటర్లు సమాయత్తమవుతున్నారు. గురువారం సాయంత్రం వరకు అన్ని పార్టీల ప్రచారాన్ని, హామీలను ఓపిగ్గా ఉన్న సగటు ఢిల్లీ ఓటరు తమ నాయకుడిని ఎన్నుకునేందుకు రెడీ అయ్యారు. పోలింగ్‌లో మొత్తం కోటి 47 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోబోతున్నారు. ఢిల్లీ రాష్ట్ర పరిధిలో మొత్తం 13750 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసింది ఎన్నికల సంఘం. ఢిల్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈసీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. 190 కంపెనీలకు చెందిన సెంట్రల్ పారామిలటరీ బలగాలను ఈసారి భద్రత కోసం వినియోగిస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో మోహరించిన బలగాల సంఖ్య కంటే ఇది నాలుగు రెట్లు ఎక్కువ. ఓటర్ల పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొనేందుకు వీలుగా కొన్ని సంస్థలు ఆఫర్లు ప్రకటించాయి. ఢిల్లీలో ఓటు హక్కు ఉండి వేరే ప్రాంతాల్లో ఉంటున్న వారికి స్పైస్ జెట్ అద్భుతమైన ఆఫర్ ప్రకటించింది. స్పైస్ డెమొక్రసీ పేరుతో ఉచిత ప్రయాణి టిక్కెట్లను జారీ చేస్తోంది. ముందుగా నమోదు చేసుకున్న వాళ్లకు బేస్ ఫెయిర్‌ను రద్దు చేస్తారు... కేవలం పన్నులు చెల్లిస్తే సరిపోతుంది. మరోవైపు ఓటర్ల సౌకర్యం కోసం ఢిల్లీ మెట్రో రైల్ గంటన్నర ముందు నుంచే సర్వీసులు ప్రారంభిస్తోంది. ఉదయం 4 గంటల నుంచే ఢిల్లీలో మెట్రో సర్వీసులు ప్రారంభమవుతున్నాయి. ఢిల్లీ ఎన్నికల్లో గెలుపుపై ఎవరి లెక్కలు వాళ్లు వేసుకుంటున్నా ఒపీనియన్ పోల్స్ సర్వేలు మాత్రం మరోసారి ఆప్‌దే అధికారమంటున్నాయి. జనవరి ఆరు నుంచి నిన్నటి వరకు ఆరు సార్లు వివిధ సంస్థలు సర్వేలు నిర్వహించాయి. అన్నింటిది ఒకటే మాట. ఆమ్ ఆద్మీ పార్టీ 48 నుంచి 60 సీట్లు కైవసం చేసుకుంటుందన్నది ఒపీనియన్ పోల్స్ సారాంశం. ఉచిత విద్యుత్, ఉచిత నీటి సరఫరా, బస్తీ వాసులకు నాణ్యమైన వైద్యం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం ఇలాంటి మధ్యతరగతిని ప్రభావితం చేసే అనే పథకాలను అమలు చేస్తున్న కేజీవ్రాల్‌కు ఢిల్లీ ఓటర్లు మరోసారి అవకాశం ఇస్తారంటున్నాయి సర్వేలు. 2015 ఎన్నికల్లో కేవలం 3 సీట్లకు మాత్రమే పరిమితమైన బీజేపీ ఈసారి ఢిల్లీలో అధికారం కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది. పౌరసత్వ సవరణ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో బీజేపీకి ఇవి అగ్ని పరీక్షగానే చెప్పాలి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా షహీన్ బాగ్‌లో కొనసాగుతున్న ఆందోళనలు కూడా ఈ సారి ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించబోతున్నాయి. గత ఎన్నికల్లో పూర్తిగా తుడిచిపెట్టేసుకుపోయిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారన్నది కూడా చూడాలి.

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్‌తో జెఏసి నేతల భేటీ

అమరావతి రాజధానిగా కొనసాగాలని వినతి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): ఏపీలో కొనసాగుతున్న రాజధాని ఆందోళనలపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆరా తీశారు. ఢిల్లీ పర్యటనలో వున్న అమరావతి రాజధాని ప్రాంత రైతుల బృందం శుక్రవారం నాడు రాష్ట్రపతిని కలిసింది. రాష్ట్రపతిని కలిసిన వారిలో అమరావతి రైతులతోపాటు జేఏసీ నేతలు, టీడీపీ ఎంపీలు కేశినేని నాని, గల్లా జయదేవ్ తదితరులున్నారు. రాష్ట్రపతిని కలిసిన తర్వాత ఈ బృందం మీడియాతో మాట్లాడింది. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, పరిస్థితులపై రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లి విజ్ఞప్తి పత్రాన్ని అందజేసామని వారు తెలిపారు. రాష్ట్రంలో రైతులు చేస్తున్న నిరసనలు దీక్షల గురించి రాష్ట్రపతి అడిగి తెలుసుకున్నారని చెప్పారు. రైతుల మరణాలు చాలా దురదృష్టకరమని రాష్ట్రపతి అభిప్రాయపడినట్లు అమరావతి జెఏసీ ప్రతినిధులు తెలిపారు. ప్రధానమంత్రి, కేంద్ర హోమ్ మంత్రి అపాయింట్మెంట్ కోసం ఎదురు చూస్తున్నామన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కూడా కలిసి విజ్ఞప్తి పత్రం అందజేసామని చెప్పారు. ఇప్పటికే ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిశామని, వారిలో చాలా మంది జగన్ ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారని అన్నారు.జగన్ ప్రభుత్వ ధోరణి వల్ల భవిష్యత్తులో ఎవరూ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వంతో సహకరించేందుకు ముందుకు రారని ప్రతినిధి బృందం అభిప్రాయపడింది. భూములు ఇచ్చిన రైతుల్లో 30శాతం మంది దళితులు ఉన్నారని, ప్రభుత్వాలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని వారు కోరుతున్నారు. అమరావతినే ఏపీ రాజధానిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

షిర్డీసాయిని దర్శించుకున్న నటుడు సంజయ్‌దత్

ముంబై,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): బాలీవుడ్ హీరో సంజయ్ దత్.. షిరిడీ సాయి నాథున్ని దర్శించుకున్నారు. బాబాకి నమస్కారం చ